ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 29 ఆగస్టు 2025



విశాఖ చేరుకున్న మంత్రి లోకేశ్

పార్టీ కార్యాలయంలో అర్జీల స్వీకరణ

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):
రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ మూడు రోజుల పర్యటన కోసం గురువారం సాయంత్రం నగరానికి ... మిగతా 8వ పేజీలో


లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి వంగలపూడి అనిత

నేడు ముఖ్యమంత్రి విశాఖ రాక

ఇండియా ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సదస్సుకు హాజరు

- అనంతరం డబుల్ డెక్కర్ బస్సుల ప్రారంభం



విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం నగరానికి రానున్నారు. తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11.15 గంటలకు బీచ్‌రోడ్డులోని కోస్టల్ బ్యాటరీకి చేరుకుంటారు. నేరుగా నోవాటెల్ హోటల్‌కు వెళతారు. అక్కడ జరిగే ఇండియా ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సదస్సులో పాల్గొంటారు. అనంతరం 12.55 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం వద్దకు చేరుకుంటారు. ఏపీ టూరిజం ఏర్పాటుచేసిన డబుల్ డెక్కర్ (హాప్ ఆన్-హాప్ ఆఫ్) బస్సులను ప్రారంభిస్తారు. 1.10 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళతారు. మధ్యాహ్నం భోజనం తర్వాత రెండు గంటలు నుంచి 3.45 గంటల వరకు గ్రిఫిన్ ఫౌండర్ నెట్‌వర్క్ మీటింగ్‌లో పాల్గొంటారు. 3.50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుని విమానంలో బెంగళూరు వెళతారు.

జనసేనకు యువతే ప్రాణం

- రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే అలయన్స్ అవసరం... ప్రజలు కూడా అదే కోరుకుంటున్నారు
- పొత్తులో ఉన్నా పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టి పనిచేయాలి
- నాయకులకు జనసేన అధినేత కె.పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం



విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):
భవిష్యత్తు జనసేనదేనని, పార్టీకి యువతే ప్రాణమని, వారిని నాయకులు కలుపుకొని వెళ్లాలని అధినేత పవన్ కల్యాణ్ లెజిస్లేటివ్ మీటింగ్‌లో సూచించారు. బీచ్‌రోడ్డులోని బీచ్ వ్యూ హోటల్‌లో ఆయన గురువారం పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకూ జనసేన పార్టీని ముందుకు నడిపిస్తానని స్పష్టంచేశారు. పార్టీని తాను నడపలేనని కొందరు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానాలు చేశారని, ఇప్పుడు వారే పార్టీ సాధించిన విజయాలు చూసి అభిప్రాయాలు మార్చుకుంటున్నారన్నారు. మూడు పార్టీలు కలిసి పనిచేసినప్పుడు ... మిగతా 8వ పేజీలో


మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశమైన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్


అనకాపల్లి ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 126 అడుగుల భారీ లక్ష్మీగణపతి విగ్రహం

అధికారుల్లో పెచ్చరిల్లిన అవినీతి

ప్రతి పనికీ ఓ రేటు పెట్టేశారు

- లంచం ఇవ్వనిదే విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదు
- రెవెన్యూ శాఖలో సైతం అక్రమాలు
- ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఇరిగేషన్ శాఖల్లో కమీషన్ల దందా


సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత, సమీక్షా సమావేశానికి హాజరైన అధికారులు

- నిఘా వర్గాల నివేదిక నా వద్ద ఉంది
- తీరు మార్చుకోండి.. లేకపోతే సెలవుపై వెళ్లిపోండి
- హోం మంత్రి అనిత తీవ్రస్థాయిలో హెచ్చరికలు
- 'పేట నియోజకవర్గం అధికారులతో సమీక్షా సమావేశం

నక్కపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):
"హోం మంత్రిగా బిజీగా వుండి, నియోజకవర్గంలో ఏం జరిగినా నేను పట్టించుకోవడం లేదని కొందరు అధికారులు అనుకుంటున్నారు. నియోజకవర్గంలో ఏ అధికారి ఏం చేస్తున్నారో నాకు బాగా తెలుసు. అధికారుల బదిలీల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాను. పనిచేసే అధికారులనే నా నియోజకవర్గంలో నియమించుకున్నాను. కానీ మీరు మాత్రం అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు కొన్ని శాఖల్లో ప్రతి పనికీ ఒక రేటు నిర్ణయించేశారు" అని హోం మంత్రి వంగలపూడి అనిత, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నక్కపల్లిలోని మండల మహిళా సమాఖ్య (వెలుగు) కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం పాయకరావుపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రభుత్వ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతమంది అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తాను చెప్పుడు మాటలు విని, పూర్తి ఆధారాలతో మాట్లాడుతున్నానని ... మిగతా 8వ పేజీలో

భావి ఉపాధ్యాయుల ఆనంద హేల

డీఎస్సీ మెరిట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం

- విశాఖ విమల విద్యాలయంలో ప్రక్రియ
- పర్యవేక్షించిన జిల్లా పరిశీలకుడు, డీఈవో
- ఇబ్బందుల పరిష్కారానికి తాత్కాలిక కౌంటర్


విశాఖ విమల విద్యాలయంలో డీఎస్సీ అర్హుల ధ్రువపత్రాల పరిశీలన

విశాఖపట్నం/ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):
మెగా డీఎస్సీలో మెరిట్ ప్రకారం కాల్ లెటర్లు అందుకున్న భావి ఉపాధ్యాయుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. సుమారు ఏడేళ్ల తరువాత నిర్వహించిన డీఎస్సీలో ప్రతిభ కనబరచిన అభ్యర్థుల ధ్రువపత్రాలను గురువారం నుంచి విశాఖ విమల విద్యాలయంలో పరిశీలించనున్నట్టు పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది. ఈ మేరకు కుటుంబ సభ్యులతో కలిసి అభ్యర్థులు ఉదయం ఎనిమిది గంటలకే విద్యాలయ ప్రాంగణానికి చేరుకున్నారు. తొలిరోజు గదికి 50 మంది వంతున అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేశారు. ఒక్కొక్క గదిలో అన్ని కేటగిరీలకు చెందిన అభ్యర్థులను కేటాయించారు. గతంలో కేటగిరీ, ర్యాంకుల వారీగా ధ్రువపత్రాల పరిశీలన ఉండేది. కాగా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు సంబంధించి ఇబ్బందులు ఉన్నా, ఇతరత్రా సందేహాలున్నా నివృత్తి చేసేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు నేతృత్వంలో ... మిగతా 8వ పేజీలో

శ్రమించారు, సాధించారు

తండ్రి లక్ష్యం కోసం ఒకరు...

- అవమానాలను తట్టుకుని మరొకరు
- ఎస్జీటీలో జిల్లా ప్రథమ, ద్వితీయ ర్యాంకర్ల విజయగాథ

ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీ పోస్టులకు 14,500 మంది పోటీపడితే వారిలో 92.9 మార్కులతో గనివాడ సుజాత ప్రథమ ర్యాంకు, 92.58 మార్కులతో తాటికొండ ధనలక్ష్మి రెండో ర్యాంకు సాధించారు. ఇరువురూ అనేక సవాళ్లను ఎదుర్కొని ఉపాధ్యాయ ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకుని అనుకున్నది సాధించారు.

చోడవరం మండలం రేవళ్ల గ్రామానికి చెందిన గనివాడ సత్యనారాయణకు... మిగతా 8వ పేజీలో

చెప్పలేనంత ఆనందంగా ఉంది



ఎస్జీటీ కేటగిరీలో ప్రథమ ర్యాంకు వచ్చినందుకు చెప్పలేనంత ఆనందంగా ఉంది. తండ్రి ఆశయం కోసం కష్టపడి చదివాను. ఇప్పుడు ఆయన లక్ష్యం, ఆశయం నెరవేరడం సంతోషంగా ఉంది. డీఎస్సీ నిర్వహిస్తామన్న ప్రభుత్వం హామీ నిలబెట్టుకుంది. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే ఆశయంగా పనిచేస్తాను.

గనివాడ సుజాత, రేవళ్ల
ఎస్జీటీ ప్రథమ ర్యాంకరు

ఘనంగా వినాయక చవితి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మట్టితో రూపొందించిన 126 అడుగుల భారీ లక్ష్మీగణపతి విగ్రహం భక్తులను ఆకట్టుకుంటున్నది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ బుధవారం ఉదయం తొలి పూజ నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం రాజకీయ, అధికార, అనధికార ప్రముఖులు దర్శించుకుని పూజలు చేశారు. చోడవరం, ఎలమంచిలి, నర్సీపట్నం ప్రాంతాల్లో విభిన్న రూపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు.

పసుపు వర్ణంలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

చోడవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):



స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండో రోజైన గురువారం స్వయంభూ గణేశుడు పసుపువర్ణంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు.

రైలు ఢీకొని తండ్రి, కొడుకు మృతి

- పాయకరావుపేట- తుని మధ్య తాండవ రైల్వే వంతెన మీదుగా వెళుతుండగా ప్రమాదం

పాయకరావుపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):
పాయక రావుపేట వద్ద తాండవ నదిపై ఉన్న రైల్వే వంతెన మీదుగా నడుచుకుంటూ వెళుతున్న తండ్రి, కొడుకును రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఇందుకు సంబంధించిన వివరాలను తుని ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు గురువారం వెల్లడించారు. ఈ విధంగా ఉన్నాయి. బాపట్ల జిల్లా రేపల్లె మండలం గుడికాయలంక గ్రామానికి చెందిన బొర్రా అనిల్ (36), జనని ప్రేమ వివాహం చేసుకుని, కొంత కాలం నుంచి అనకాపల్లి జిల్లా పాయకరావుపేట లింగాలతోట కాలనీలో నివాసం వుంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె వున్నారు. మద్యానికి బానిస అయిన అనిల్.. రోజూ తాగివచ్చి భర్యతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో 26వ తేదీన భార్యతో గొడవ పడిన అనిల్... కుమారుడు గుణశేఖర్(8)ను వెంటబెట్టుకుని రేపల్లె వెళ్లేందుకు తునిలో రైలు ఎక్కడం కోసం తాండవ నదిపై ఉన్న రైల్వే వంతెన మీదుగా ... మిగతా 8వ పేజీలో


బొర్రా అనిల్, గుణశేఖర్ (ఫైల్ ఫొటో)

వరినాట్లు ముమ్మరం

జోరుగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతల ఆనందం

- ఖరీఫ్‌లో 54,465 హెక్టార్లలో వరి సాగు లక్ష్యం
- ఇంతవరకు 36,832 హెక్టార్లలో నాట్లు పూర్తి
- వచ్చే నెల మొదటి వారంలోగా లక్ష్యం పూర్తవుతుందని అధికారుల అంచనా


రావికమతం మండలం చినపాచిలలో పూర్తయిన వరినాట్లు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)
జిల్లాలో రెండు రోజుల కిందట కురిసిన భారీ వర్షాలు వరి సాగుకు ఊతం ఇచ్చాయి. చెరువులతోపాటు పొలాల్లో కూడా వర్షం నీరు చేరడంతో దమ్ము, వరినాట్లు పనులను ముమ్మరం చేశారు. వాస్తవంగా ఆగస్టు నెల మొదటి పక్షంలో వరినాట్లు జోరుగా సాగుతుంటాయి. కానీ ఈ ఏడాది జూలై నుంచి ఆగస్టు రెండో వారం వరకు వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వరినాట్లు ఆలస్యం అయ్యాయి. మూడో వారంలో భారీ వర్షాలు పడడంతో అన్నదాతలు ఊరట చెందారు. పొలాలను దమ్ముచేసి, నాట్లు వేయడం మొదలుపెట్టారు. సుమారు వారం రోజుల విరామం తరువాత ఈ నెల 25, 26 తేదీల్లో మరోసారి భారీ వర్షాలు కురిశాయి. దీంతో వరినాట్లు మరింత జోరుగా సాగాయి. ఖరీఫ్‌లో వరి సాగు లక్ష్యం 54,465 హెక్టార్లు కాగా వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం గురువారంనాటికి 36,832 హెక్టార్లలో (67.62 శాతం) వరినాట్లు పూర్తయ్యాయి. చోడవరం, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల, అనకాపల్లి, మునగపాక మండలాల్లో వరి నాట్లు 70 శాతం పూర్తయ్యాయి. నర్సీపట్నం, గొలుగొండ, కోటవురట్ల, మాకవరపాలెం మండలాల్లో జోరుగా సాగుతున్నాయి. పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి, ఎలమంచిలి, కశింకోట మండలాల్లో నెమ్మదిగా వరి నాట్లు వేస్తున్నారు. సెప్టెంబరు మొదటి వారంలోగా లక్ష్యం మేరకు వరి నాట్లు పూర్తవుతాయని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు.

కాజ్‌వేలను ముంచెత్తిన వరద

రాకపోకలకు పలు మండలాల ప్రజలు ఇక్కట్లు

- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు


వడ్డాది కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దేరు వరద నీరు


వరద ధాటికి ధ్వంసమైన తాచేరు కాజ్‌వే

బుచ్చెయ్యపేట ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):
ఎగువ ప్రాంతంతోపాటు బుచ్చెయ్యపేట మండలంలో కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పెద్దేరు, బొడ్డేరు, తాచేరు గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వడ్డాది వద్ద కాజ్‌వే మీదుగా పెద్దేరు వరద ప్రవహిస్తున్నది. దీంతో వాహనాల రాకపోకలకు వీలుకాని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు వంటి తేలికపాటి వాహనాలను పాత వంతెన మీదుగా అనుమతిస్తున్నారు. మిగిలిన భారీ వాహనాలను వేరే మార్గాల్లోకి ... మిగతా 8వ పేజీలో

వాణిజ్య సముదాయాలపై జీవీఎంసీ నిర్లక్ష్యం

- రూ.2 కోట్లకుపైగా అద్దె బకాయిలు
- అధికారుల నిర్లక్ష్యం


గవరపాలెంలో చిన్నయ్యస్కూల్ వద్ద వృథాగా వున్న జీవీఎంసీ దుకాణాలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)
మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అనకాపల్లి జోనల్ కార్యాలయం అధికారుల నిర్లక్ష్యం కారణంగా దుకాణ సముదాయాల అద్దె బకాయిలు పేరుకుపోతున్నాయి. జీవీఎంసీ వాణిజ్య సముదాయాలు, మార్కెట్లు, లీజులు, మొండి బకాయిల వివరాలను రెండేళ్ల కిందట పాలకవర్గం సేకరించింది. నెలల తరబడి దుకాణాల అద్దెలు చెల్లించని వ్యాపారులపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగిస్తామని హెచ్చరించారు. కానీ ఆచరణలో అమలు చేయలేదు.

జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం పరిధిలో 14 దుకాణ సముదాయాలు (షాపింగ్ కాంప్లెక్స్‌లు) ఉన్నాయి. జోనల్ కార్యాలయానికి ఆనుకొని ఆరు, హైస్కూల్ లైన్‌లో 19, మునిసిపల్ ఆటస్థలం వద్ద 12, గవరపాలెం హైస్కూల్ వద్ద ఆరు, డాక్టర్ ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియం వద్ద 19, సర్వకామదాంబ పార్క్ వద్ద 11, ఎంటీజీహెచ్ స్కూల్ వద్ద ఐదు, న్యూకాలనీ వద్ద ఎనిమిది, గవరపాలెం బాలికల ఉన్నత పాఠశాల వద్ద 12, రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వద్ద 10, సతకంపట్టు ఏరియా వద్ద మూడు, ఉడ్‌పేట ఏ బ్లాక్‌లో 12, ఉడ్‌పేట బీ బ్లాక్‌లో 11, పెరుగు బజార్ వద్ద 25.. మొత్తం 159 దుకాణాలు ఉన్నాయి. వివిధ కారణాల వల్ల వీటిల్లో పలు దుకాణాలు ఖాళీగా ... మిగతా 8వ పేజీలో

వైభవంగా కోటవురట్ల మరిడిమాంబ జాతర



భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయం

కోటవురట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల వరహానది ఒడ్డున మరిడిమాంబ అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. గురువారం అమ్మవారికి పూజలు చేసేందుకు వందలాది మంది భక్తులు ఉదయం ఆరు నుంచి సాయంత్రం 5 గంటల వరకు బారుల తీరారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైసీపీ అదనపు కార్యదర్శి సాగి సీతాబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జాతర సందర్భంగా కోటవురట్ల జంక్షన్ నుంచి అమ్మవారి గుడి వరకు విద్యుత్ దీపాలతో అలకరించారు. జాతరను గ్రామకమిటీ నాయకులు పినపాత్రుని గుర్రయ్యదొర, కసిరెడ్డి యేసు, జవ్వాది రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు పీ సూర్యరావు ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

లైన్ వరి నాట్లుతో అధిక దిగుబడులు



పెదరాంభద్రపురంలో కూలీలతో లైన్‌గా వరి నాట్లు వేస్తున్న వ్యవసాయ సిబ్బంది

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వరిలో లైన్ నాట్లుతో పంటకు మెరుగైన గాలి, వెలుతురు అంది, మంచి దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి పి. ఆదినారాయణ అన్నారు. మండలంలోని సత్యవరం, పెదరాంభద్రపురం గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల మధ్య దూరం ఉండడంతో వాటికి కావలసిన పోషకాలు అందుతాయన్నారు. తద్వారా అధిక దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నాగమణి, వ్యవసాయ సిబ్బంది వెంకట్ పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్‌డీపీవో



యువకులతో మాట్లాడుతున్న ఎస్‌డీపీవో శ్రీనివాస్, సీఐ అప్పన్న

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం తాండవ నది బ్రిడ్జి వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రదేశాన్ని గురువారం నర్సీపట్నం ఎస్‌డీపీవో శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా యువకులకు, పోలీసు సిబ్బందికి నిమజ్జనోత్సవంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఎటువంటి అప్రశుతులు జరగకుండా చూడాలన్నారు. అనంతరం గ్రామంలోని వినాయక మండపాలను పరిశీలించారు. ఆయన వెంట సీఐ జి. అప్పన్న, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మాసాహెబ్‌పేట పంచాయతీలో కలపాలి

▸▸ రాష్ట్ర హోంమంత్రి అనితకు వినతి

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం పంచాయతీ పరిధిలోని 12వ వార్డులో ఉన్న వంద కుటుంబాలను మాసాహెబ్‌పేట పంచాయతీలో కలపాలని వార్డుకు చెందిన గంటా వీర్రాజు, కె.శంభుడు, కె.శ్రీనివాసరావు తదితరులు కోరారు. గురువారం రాష్ట్ర హోం మంత్రి అనితను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వం నుంచి తాము మాసాహెబ్‌పేటలోనే నివసిస్తున్నామన్నారు. కొంత కాలంగా తమను సత్యవరం రెవెన్యూ పరిధిలో కలపడం జరిగిందని పేర్కొన్నారు. తమ వంద కుటుంబాలను మాసాహెబ్‌పేట పంచాయతీలో కలపాలని కోరారు. కార్యక్రమంలో వెలుగుల నూకరాజు, కొంతం రామారావు, కె. నాగేశ్వరరావు, కంకిపాటి దివాణం, జి.విజయ్‌బాబు, వెలుగుల రమణ, డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జోరందుకున్న వరి నాట్లు



మునగపాక పాటిదిబ్బ ప్రాంతంలో వరినాట్లు వేస్తున్న మహిళలు

మునగపాక, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వర్షం తెరిపివ్వడంతో మండలంలో వరి నాట్లు జోరందుకున్నాయి. ఇటీవల వర్షాలు విస్తారంగా కురవడంతో వరినాట్లు నిలిచిపోయాయి. బుధవారం వినాయక చవితి కూడా ముగియడంతో గురువారం తిరిగి వరినాట్లు చేపట్టారు. తుపాన్‌కు ముందు 25 శాతం మాత్రమే వరినాట్లు వేశారు. వాతావరణం అనుకూలంగా ఉంటే ఉడుపులు ముమ్మరంగా జరుగుతాయని రైతులు చెబుతున్నారు. దమ్ముకు అవసరమైన నీరు అందుబాటులో ఉన్నప్పటికి ఉడుపులకు కూలీలు దొరకడం లేదని వారంటున్నారు. నాట్లు వేగవంతం కూలీల లభ్యతపైనే ఆధారపడి ఉంటుందని తెలిపారు.

250 కొబ్బరి మొక్కలు నాటిన సర్పంచ్



పోతిరెడ్డిపాలెంలో కొబ్బరి మొక్క నాటుతున్న సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, ఎంపీడీఓ కొండలరావు

ఎలమంచిలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపాలెం గ్రామ శివారులో గురువారం సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, ఎంపీడీఓ. కేఎస్. కొండలరావు 250 కొబ్బరి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ కొబ్బరి మొక్కల ఫలసాయం ద్వారా వచ్చిన ఆదాయంతో పంచాయతీలో అభివృద్ధి పనులు చేయవచ్చునన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ మొక్కల పెంపకాన్ని గ్రామస్థులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో ఆటల పోటీలు

మునగపాక, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాడ్రాపల్లిలో జోగినాయుడు మాస్టార్ గ్రంథాలయం 14వ వార్షికోత్సవంలో భాగంగా ఆటలు పోటీలు నిర్వహించినట్టు గ్రంథాలయ గౌరవాధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 29న గ్రంథాలయం ఆవరణలో ముగింపు వేడుకలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో బొడ్డేడ సత్యనారాయణ, మళ్ల అప్పలనాయుడు, కాండ్రేగుల శ్రీను, కొణతాల శివరామకృష్ణ, కొయిలాడ వసంత, జ్యోతి పాల్గొన్నారు.



పాయకరావుపేట దుర్గానగర్ వినాయక నవరాత్రి ఉత్సవాల్లో చవితి వినాయకుడు



ఎలమంచిలి పట్టణంలోని కొత్తపేట పాతరామ కోవెల వద్ద ఏర్పాటు చేసిన 14 అడుగుల మట్టి మహాగణపతి



ఎలమంచిలి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఆకట్టుకుంటున్న 14 అడుగుల వినాయకుడు



మునగపాక లింగరాయి ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడు

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా...

భక్తి శ్రద్ధలతో వినాయక చవితి

పాయకరావుపేట/అచ్యుతాపురం/మునగపాక/ఎలమంచిలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధి వినాయక చవితిని బుధవారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఇంట్లో వినాయక ప్రతిమను ప్రతిష్ఠించి ఉండ్రాళ్ళు, పిండి వంటలతో పూజలు చేశారు. పాయకరావుపేటలో పాండురంగస్వామి ఆలయం, సీతారామాలయం, దుర్గాలమ్మచెట్టు ఆలయం, కరణంగారి వీధి, దుర్గానగర్, పెదిరెడ్డివారి వీధిలోని వరసిద్ధి వినాయక ఆలయాల్లో వినాయక చవితి పూజలు ఘనంగా నిర్వహించారు. అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో ఏకంగా 25 వినాయక పందిళ్లు ఏర్పాటు చేసి విగ్రహాలను నెలకొల్పారు. మునగపాకలోని పల్లపువీధిలో వినాయక మందిరం, విశ్వశాంతి, మిల్లు వద్ద డేంజర్‌గ్రెస్, ఎన్టీఆర్ కాలనీ, లింగరాయి ఆలయంలో భారీ విగ్రహాలను కొలువుదీర్చారు. పట్టణంలో కొత్తపేట పాతరామకోవెల వద్ద మట్టితో ఏర్పాటు చేసిన 14 అడుగుల మహాగణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



సెజ్ పునరావాస కాలనీ రామాలయంలో మట్టి వినాయక విగ్రహానికి పూజలు చేసిన నేతలు


23వ వార్డు కౌన్సిలర్ నిరాహార దీక్ష విరమణ

▸▸ నిమ్మరసం ఇచ్చి విరమింపజేసిన టీడీపీ నేతలు

▸▸ మునిసిపల్ శాఖా మంత్రి నారాయణతో ఫోన్‌లో ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు సంప్రదింపులు

▸▸ 23వ వార్డు అభివృద్ధికి రూ. కోటి, మిగిలిన వార్డులకు మరో రూ.కోటి మంజూరు చేస్తానని మంత్రి హామీ

ఎలమంచిలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపల్ కార్యాలయం వద్ద టీడీపీ కౌన్సిలర్ రామకృష్ణ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష మూడో రోజు గురువారం విరమించారు. మునిసిపాలిటీలోని 23వ వార్డు అభివృద్ధిలో మునిసిపాలిటీ పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, వార్డును డీనోటిఫై చేసి పంచాయతీగా మార్చాలని కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ మంగళవారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో గురువారం టీడీపీ నేతలు ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు మునిసిపల్ శాఖా మంత్రి నారాయణతో ఫోన్లో సంప్రదింపులు జరిపారు. కొక్కిరాపల్లి వార్డును కోటి రూపాయలతో అభివృద్ధి చేసేందుకు, మిగిలిన వార్డుల అభివృద్ధికి మరో కోటి రూపాయలు మంజూరు చేస్తున్నట్టు మంత్రి నారాయణ నేతలకు హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు దీక్షా శిబిరానికి వచ్చి మంత్రి నారాయణ ఇచ్చిన హామీని వివరించారు. వారంతా కౌన్సిలర్ రామకృష్ణకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. అనంతరం నిధులు మంజూరుపై మంత్రి ఇచ్చిన హామీని తెలియజేస్తూ హామీ పత్రాన్ని కౌన్సిలర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రగడ, చలపతిరావు మాట్లాడుతూ మునిసిపాలిటీలో సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లామని, ఎలమంచిలిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు దూళి రంగనాయకులు, గొర్లె నానాజీ, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కొఠారు సాంబ, ఆడారి ఆదిమూర్తి, రాజాన సూర్యనాగేశ్వరరావు, కరణం రవి, బొద్దపు నాగేశ్వరరావు, దంట్ల వెంకట స్వామి, గొర్లె బాబూరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



23వ వార్డు కౌన్సిలర్ రామకృష్ణకు నిమ్మరసం ఇచ్చి నిరాహార దీక్షను విరమింపజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, నేతలు ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు



దీక్ష విరమించిన రామకృష్ణకు హామీ పత్రం అందజేస్తున్న నేతలు

వినాయక విగ్రహాల నిమజ్జనంతో పెంజెరువు కిటకిట



పెంజెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు

ఎలమంచిలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పెంజెరువు బుధవారం సాయంత్రం వినాయక విగ్రహాల నిమజ్జనానికి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. వినాయక చవితిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాయంత్రం ఇళ్లలోని వినాయక విగ్రహాలను పెంజెరువులో నిమజ్జనం చేసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో రద్దీగా మారింది. భక్తులు పెంజెరువులో విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

ఐద్వా మహాసభను జయప్రదం చేయండి

రాంబిల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కశింకోటలో ఈనెల 31న జరిగే జిల్లా మహా సభను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా జాయింట్ సెక్రటరీ సీహెచ్ మంగాతయారు పిలుపునిచ్చారు. గురువారం ఆమె స్థానిక ఐద్వా కమిటీ సభ్యులతో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పించాలని, మద్యం, మత్తుపదార్థాలను నియంత్రించాలని, డ్వాక్రా మహిళలకు జీరో వడ్డీకే రుణాలు ఇవ్వాలని, మత్స్యకార మహిళలకు ఉపాధి కాల్పించాలని, మహిళా కార్మికులకు కనీస వేతనం రూ. 21వేలు ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల నాయకులు రాజేశ్వరి, లక్ష్మీభవాని, దేవి, జగదీశ్వరి, తలుపులమ్మ, రామలక్ష్మి, వెంటకలక్ష్మి పాల్గొన్నారు.

అధిక లోడు వాహనంతో ట్రాఫిక్‌కు అంతరాయం



పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన అధికలోడు వాహనం

ఎలమంచిలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం అధికలోడు వాహనంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ అధికలోడు వాహనం అచ్యుతాపురం వైపు వెళ్లేందుకు పట్టణంలోకి రాగా పట్టణ పోలీస్ స్టేషన్ వద్దనే యూ టర్న్ తీసుకోవడానికి లారీ డ్రైవర్ తీవ్రంగా ఇబ్బంది పడాల్సివచ్చింది. ఈ క్రమంలో ప్రధాన రోడ్డుపై లారీ అడ్డంగా నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. పట్టణంలోకి అధికలోడు వాహనాలు రాకుండా పోలీసులు నివారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఘనంగా మహాలక్ష్మి జాతర

▸▸ అమ్మవారిని దర్శించుకున్న హోం మంత్రి అనిత

ఎస్.రాయవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరంలో మహాలక్ష్మి అమ్మవారి జాతరను బుధవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. హోం మంత్రికి టీడీపీ నేత పల్లెల జగ్గారావు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొప్పిశెట్టి వెంకటేష్, యేజెర్ల వినోద్‌రాజు, అమలకంటి అబద్ధం, ఎన్ వెంకటరాజు, గుర్రం రామకృష్ణ, తుమ్మపాల నాగేశ్వరరావు, కొప్పిశెట్టి బుజ్జి, రెడ్డి పవన్‌కుమార్, సుంకర శ్రీనివాసరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.



వమ్మవరంలో మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న హోంమంత్రి వంగలపూడి అనిత, టీడీపీ నాయకులు

మోసయ్యపేటలో కుక్కల స్వైరవిహారం

▸▸ రోడ్డు మీదకు రావడానికి భయపడుతున్న ప్రజలు

అచ్యుతాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురాన్ని ఆనుకొని ఉన్న మోసయ్యపేటలో గ్రామ సింహాలు స్వైర విహారం చేస్తూ గ్రామస్థులను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి. గ్రామంలో కుక్కలు పదుల సంఖ్యలో గుంపులుగా తిరుగుతూ వాహన చోదకులుతో పాటు పాదచారులను భయానికి గురిచేస్తున్నాయి. పదుల సంఖ్యలో కుక్కలు ఒకే దగ్గర పడుకుంటున్నాయి. అలాగే మందల్లా గుమిగూడి రోడ్ల గుండా విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో గ్రామస్థులు ఒక్కరూ రోడ్డు మీదకు రావాలంటేనే భయపడుతున్నారు. అంతేకాక ద్విచక్రవాహనాల వెనుక కుక్కలు పరుగులు తీసి వాహన చోదకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా చేస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మోసయ్యపేట బర్మాక్యాంపునకు వెళ్లే రోడ్డులో గ్రామసింహాలు

వీధి వ్యాపారులు జోన్ల వారీగా విక్రయాలు జరపాలి

▸▸ మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు



వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న కమిషనర్ ప్రసాదరాజు

ఎలమంచిలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో గుర్తించిన వీధి వ్యాపారులంతా విధిగా గ్రీన్ జోన్‌లో మాత్రమే వ్యాపారాలు సాగించాలని మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు సూచించారు. గురువారం మెప్మా ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయ ఆవరణలో వీధి వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీధి వ్యాపారులతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా గ్రీన్ జోన్‌ను కేటాయించామన్నారు. పట్టణంలోని వీధి వ్యాపారులకు త్వరలో గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామన్నారు. మెప్మా సీఎంఎం పద్మ మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధికి బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిజిటల్ సర్వీసెస్, బ్యాంకులు రుణాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ, పలు బ్యాంకు అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

వైభవంగా కొత్తమాంబ అమ్మవారి జాతర

రాంబిల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పెదకలవలాపల్లిలో గురువారం కొత్తమాంబ అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమలను సమర్పించారు. మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారికి గ్రామ సర్పంచ్ ఎలమంచిలి కనకారావు, మాజీ సర్పంచ్ పి.తాతబాబు, కర్రి సింహగిరిప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ వై.దేముళ్ళు, ఉపసర్పంచ్ గణేష్, గ్రామ పెద్దలు, యువకులు ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.



కొత్తమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

హోం మంత్రికి వినతుల వెల్లువ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు, మహిళలు తమ సమస్యలను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆమెను పలువురు ప్రజలు కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. వారి నుంచి హోం మంత్రి అనిత వినతులు స్వీకరించి, ఈ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా బల్క్‌డ్రగ్ పార్కు వద్దని, నిర్వాసితులకు సకాలంలో న్యాయం చేయాలని, ప్యాకేజీ పెంచాలంటూ మత్స్యకార నాయకులు, ప్రజాప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.

తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలి

ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జోస్యుల కృష్ణబాబు



గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి పూలమాలవేస్తున్న కృష్ణబాబు

పాయకరావుపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషపై మక్కువ పెంపొందించుకోవాలని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జోస్యుల కృష్ణబాబు తెలిపారు. గురువారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాష పట్ల అభిమానాన్ని, విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కుమారి శతకం, కృష్ణ శతకం, సుమతీ శతకంలోని పద్యాలను రోజుకి ఒకటి చొప్పున తప్పక నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు హెచ్‌ఎంలు, అకడమిక్ ఇన్‌చార్జిలు డీవీ.శ్రీనివాస్, అపర్ణ, నీలాదేవి, సంధ్యారాణి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో అనన్య ప్రతిభ



రోలర్ స్కేటింగ్ రాష్ట్ర పోటీల్లో రాణించిన అనన్య

నక్కపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గ్రామానికి చెందిన ఆరవ తరగతి విద్యార్థిని వి. నయన్ అనన్య రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించింది. ఈ నెల 22 నుంచి 25 వరకు కాకినాడలో రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అనన్య సత్తా చాటింది. ఆ బాలికను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.


కాశీవిశ్వేశ్వరుని ఆలయం వద్ద శ్రీవారి అవతారంలో..


గవరపాలెం జీవీఎంసీ పాఠశాల వద్ద ఆదిమాత పార్వతిదేవికి జడలు వేస్తున్నట్టు...


సబ్బవరం మండలం మొగలిపురంలో స్వామికి గండి బాబ్జీ పూజలు


పరవాడ మండలం వాడచీపురుపల్లిలో...

ఓం గం.. గణేశాయ నమః

- వాడవాడలా అత్యంత భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు
- ఇంటింటా ఆది దేవునికి విశేష పూజలు
- వీధి వీధినా కొలువుదీరిన స్వామి
- అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో ఆకట్టుకుంటున్న 'ఘన'నాథుడు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి వేడుకలను బుధవారం అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఇంటా ఉండ్రాళ్లతో పాటు వివిధ రకాల పిండి వంటలను సిద్ధం చేసి, స్వామివారి ప్రతిమను ఏర్పాటు చేసి మనసారా ఆరాధించారు. ఈ సందర్భంగా ఎటుచూసినా కోలాహల వాతావరణం నెలకొంది. ఇక వీధి వీధినా వివిధ రూపాల్లో ఆది దేవుడు దర్శనమిచ్చారు. అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 126 అడుగుల భారీ లక్ష్మీగణపతి విగ్రహాన్ని సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ తొలి పూజ నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. డీఎస్పీ ఎం శ్రావణి, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కమిటీ అధ్యక్షుడు బుద్ద భూలోకనాయుడు ఆధ్వర్యంలో నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అలాగే, వేల్పుల వీధిలో 37 అడుగుల వినాయకుడు, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీవారి అలంకరణలో గణనాథుడు, కోట్నివీధిలో నంది వాహనంపై వినాయకుడు, పరమశివుడు, గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాల వద్ద పార్వతీదేవికి జడలను వినాయకుడు, కుమారస్వామి వేస్తున్నట్టు, వేగి వీధిలో రామావతారంలో వినాయకుడు, ఆంజనేయ విగ్రహాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. అగ్గిమర్రిచెట్టు వద్ద గల సరస్వతిదేవి అలంకరణలోని గణనాథుడ్ని జిల్లా జడ్జి రమేష్ దంపతులు దర్శించుకున్నారు. అదేవిధంగా నూకాంబిక అమ్మవారి ఆలయంలో చవితి వేడుకలను మరింత ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో కేఎల్ సుధారాణి, మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, మాజీ ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పూజలు జరిపారు.

శారదా నదిలో భారీగా ప్రతిమలు నిమజ్జనం

ఇదిలావుంటే, పలు ఇళ్లలో, వివిధ వాణిజ్య, వ్యాపార సముదాయాలు, విద్యాలయాలు, పలు మండలాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను బుధవారం సాయంత్రం నుంచి శారదా నది ఒడ్డున గల ఘాట్‌లో నిమజ్జనం చేశారు. సామూహిక వినాయక నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకులు ఆడారి కుమారస్వామి, పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్ఐలు వెంకటేశ్వరరావు, సంతోష్‌కుమార్‌ల పర్యవేక్షణలో నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించారు. భక్తులను వినాయక ప్రతిమలతో నది లోపలికి వెళ్లనీయకుండా జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి ఆదేశాల మేరకు ముందుగానే అధికారులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఘాట్ వద్ద వివిధ శాఖల సిబ్బంది పహారా కాశారు. భక్తులు తీసుకువచ్చే పత్రులను నదిలో వేయనీయకుండా జీవీఎంసీ అధికారులు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు వీటిని ప్రత్యేక వాహనం ద్వారా దూర ప్రాంతాలకు తరలించారు. నిమజ్జన ఘాట్ రద్దీగా మారడంతో కొంతమంది భక్తులు వంతెన పైనుంచే వినాయక ప్రతిమలు, పూజా సామగ్రిని నదిలో వేశారు. అనకాపల్లిలోని శారదానది ఘాట్, తుమ్మపాలకు వెళ్లే మార్గంలోని ఏలేరు ఘాట్ వద్ద నిమజ్జనాలను డీఎస్పీ ఎం.శ్రావణి బుధవారం రాత్రి పరిశీలించారు.


ఎన్టీఆర్ స్టేడియంలో భారీ గణనాథుని విగ్రహం వద్ద రత్నాకర్ తొలిపూజ


నూకాంబిక ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద...

పరవాడ మండలంలో...

పరవాడ/లంకెలపాలెం : వినాయక చవితి పర్వదినాన్ని మండల ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లలో స్వామివారిని భక్తిశ్రద్ధలతో కొలుసుకున్నారు. వీధివీధినా మండపాల్లో ఆది దేవుడు కొలువుదీరాడు. వెన్నెలపాలెం రామాలయంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దంపతు వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పరవాడ బొంకులదిబ్బ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన విగ్రహం వద్ద ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులు పూజలు నిర్వహించారు. వాడచీపురుపల్లిలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు దంపతుల విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు జరిపారు. అలాగే, లంకెలపాలెం, పెదముషిడివాడ, సాలాపువానిపాలెం పరసర ప్రాంత కాలనీల్లో వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆర్‌బీఆర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ప్రతిష్ఠించారు. సాలాపువానిపాలెంలో ఏర్పాటు గణపతిని వార్డు టీడీపీ కార్యదర్శి సాలాపు మోహన్‌రావు ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : మండలంలో గ్రామ గ్రామాన వినాయక చవితిని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లలో స్వామివారిని ప్రతిమను ఏర్పాటు చేసి ఉండ్రాళ్లు, వివిధ రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించి పూజలు జరిపారు. అలాగే, విధివీధినా వివిధ రూపాల్లో స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మొగలిపురంలో టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, సర్పంచ్ గండి అరుణ, ఎంపీటీసీ తమరాన సన్యాసమ్మ, పీఏసీఎస్ చైర్మన్ గండి దేముడు, గుల్లేపల్లిలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ బండారు మంగ, సబ్బవరంలో శాప్ డైరెక్టర్ పీవీఎస్ఎన్ రాజు స్వామివారి మండపాల్లో పూజలు జరిపారు.


శారదా నదిలో నిమజ్జనానికి వినాయక ప్రతిమలను తీసుకు వచ్చిన.., బ్రిడ్జిపై నుంచి నదిలో బొమ్మలను వేస్తున్న భక్తులు

వైభవంగా మరిడిమాంబ పండుగ


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు

పరవాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో మరిడిమాంబ పండుగ గురువారం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మిశ్రీనివాస్ దంపతులతో పాటు మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, పరవాడ సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, పలువురు కూటమి నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ఆటో కార్మికుల ఆందోళన

పరవాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో కార్మికులు గురువారం ఇక్కడి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికుల ఉపాధికి గండిపడిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయంగా ఆటో కార్మికులందరికీ వాహనమిత్ర పథకం కింద ఏడాదికి రూ. 25వేలు ఇవ్వాలని, సంక్షేమ బోర్డు అమలు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఆటో యూనియన్ నాయకులు రమణ, నరసింగరావు, గోపి, రవి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల 'చలో విజయవాడ' పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

సబ్బవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్‌ఈఏ) వచ్చే నెల ఒకటో తేదీన తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు రావలమ్మపాలెం జడ్పీ హైస్కూల్‌లో గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం భారతి మాట్లాడుతూ ఎన్నికలు ముందు ఉపాధ్యాయ సంఘాలకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనం భాస్కర్, డెక్క శ్రీను, అర్నిబాబు, ప్రసాద్‌లతో పాటు పలువురు ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పైలా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు


శ్రీనివాసరావు దంపతులకు గజమాల వేసి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

పరవాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఇక్కడి పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కరణం ధర్మశ్రీ, తైనాల విజయ్‌కుమార్, వుడా మాజీ చైర్మన్ రవిరాజ్, ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్లు బొడ్డేడ ప్రసాద్, చల్లా కనకారావుతో పాటు మండలంలో గల పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛాలను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు.యూత్ ప్రతినిధులు సాయిఅప్పలనాయుడు, పైలా పైడంనాయుడు, పైలా వెంకటరావు, హరీష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు : జడ్సీ


పూడిమడక రోడ్డులో పెట్టిన బండిని తొలగింపజేస్తున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గురువారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి విస్తృతంగా పర్యటించారు. పూడిమడక రోడ్డులో దుకాణాల ముందు ఉన్న బండ్లను తొలగింపజేశారు. మరోసారి దుకాణాలను రోడ్లపై పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రైల్వేస్టేషన్ రోడ్డులో మాం సాహార దుకాణం వద్ద వ్యర్థాలను కాలువల్లో పోస్తున్న యజమానికి రూ.300 జరిమానా విధించారు. మరిన్ని ప్రాంతాలకు వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

పీఆర్‌టీయూ కశింకోట మండల కార్యవర్గం


కార్యవర్గం ప్రతినిధులకు నియామక పత్రాలు అందజేస్తున్న గోపీనాథ్

కశింకోట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గం గురువారం ఇక్కడ ఎన్నికైంది. అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడిగా అల్లంక ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా గొర్లి కేశవకుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా షైచర్ల శంకరరావు, ఉపాధ్యక్షుడిగా గాడి శ్రీనివాసరావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా గుంటుకు హేమకుమారి, మహిళా కార్యదర్శిగా పెంటకోట కమల, కార్యదర్శులుగా చిలకపాటి విమల, రెడ్డి గౌరీశంకర వరప్రసాద్‌లను ఎన్నుకున్నారు. అనంతరం గోపీనాథ్ మాట్లాడుతూ ఏకపక్ష నిర్ణయాలతో ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం మండల విద్యాశాఖాధికారి-1 సురేశ్‌కు తగదన్నారు. ఈ వేధింపులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, తక్షణమేచర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలు

లంకెలపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79 వార్డు పరిధి లంకెలపాలెంలో వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని ఆర్‌బీఆర్ యూత్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర స్థాయి పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్టు యూత్ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధుల పర్యవేక్షణలో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో ఈ పోటీలు జరుపుతామన్నారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచే జట్లకు నగదు బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన


బవులువాడలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తుమ్మపాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బవులువాడలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం వరిలో 25 కేజీల కాంప్లెక్స్ ఎరువు, యూరియా 25 కేజీలు వేసుకుంటే పంట ఆశాజనకంగా ఉంటుందని చెప్పారు. అలాగే అక్కడక్కడా వరి పొలాల్లో జింకు లోపం గుర్తించినట్టు వివరించారు. దీని నివారణకు ఎకరాకు పది కేజీలు చొప్పున జింక్ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వెంకటఅప్పారావు, విజయ్, పవన్‌కుమార్, సత్యారావు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు కోరుతూ ఆందోళన

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఐదు తరాలుగా తమ సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని రోలుగుంట మండలం జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇక్కడి కలెక్టరేట్ ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సాగులో ఉన్న భూములను లాక్కొని ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలన్నారు. దీనిపై పలుమార్లు ఆర్డీవో, తహశీల్దార్‌కు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని వాపోయారు. అనంతరం జాయింట్ కలెక్టర్ జాహ్నవిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

ట్రాఫిక్ ఎస్ఐగా శేషగిరిరావు


శేషగిరిరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ట్రాఫిక్ ఎస్ఐగా శేషగిరిరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. డీసీఆర్‌బీ ఎస్ఐగా పనిచేస్తున్న ఈయనను ఎస్పీ తుహిన్‌సిన్హా ఇక్కడి ట్రాఫిక్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో విధుల్లో చేరారు. తొలుత డీఎస్పీ ఎం.శ్రావణిని మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యుత్ పోరులో అమరులకు నివాళి

అనకాపల్లి టౌన్/తుమ్మపాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో మరణించిన వారి సంస్మరణ సభ ఇక్కడి సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆపార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు గంటా శ్రీరామ్, ఆర్.శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు, ఉమా మహేశ్వరరావు, పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు వైఎన్ భద్రం, వియ్యపురాజు, కోరిబిల్లి శంకరరావు, ముక్కామల చిన్ని, నరాలశెట్టి సత్యనారాయణ, గండేపల్లి చిరంజీవి, మత్తుర్తి సూరిబాబు, మహాలక్ష్మినాయుడు తదితరులు నివాళులర్పించారు.

ప్రముఖ హోల్‌సేల్ కాయగూరల వర్తకుడు సూరిశెట్టి జగదీశ్ మృతి


సూరిశెట్టి జగదీశ్ (ఫైల్)

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి హోల్‌సేల్ కాయగూరల వర్తకుడు సూరిశెట్టి జగ్గ మహేశ్వరరావు (జగదీశ్) (63) గురువారం సాయంత్రం ఆకస్మికంగా మృతిచెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. జగదీశ్ అనకాపల్లి శ్రీగౌరీ హోల్‌సేల్ కాయగూరల వర్తక సంక్షేమ సంఘం అధ్యక్షులుగా చాలా కాలం పనిచేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను విశాఖపట్నం చికిత్స కోసం తరలించగా సాయంత్రం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల వర్తక సంఘం నాయకులు కాండ్రేగుల ఆదినారాయణ, మళ్ల జగ్గఅప్పారావు, వైఎన్ భద్రం, కొణతాల శివ తదితరులతో పాటు పలువురు సంతాపం తెలియజేశారు.

గౌరీ కిరణాల పుస్తక రచయిత కర్రి నూకరాజు కన్నుమూత


కర్రి నూకరాజు (ఫైల్)

అనకాపల్లి టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : గౌరీ కిరణాల పుస్తక రచయిత, గౌరీ గ్రంథాలయ మాజీ కార్యదర్శి కర్రి నూకరాజు (90) గురువారం ఉదయం సంతబయలు దాడివారి వీధిలోని స్వగృహంలో కన్నుమూశారు. పెదరామస్వామి ఆలయ కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. సాయంత్రం సంతబయలు శ్మశానవాటికలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, దాడి జగన్ ప్రభాకర్, సంతబయలు పెద్దలు కర్రి నూకరాజు తదితరులు నివాళులర్పించారు.


వినాయక విగ్రహ ప్రతిష్ఠకు వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ

- వెన్నెలపాలెంలో ఘటన
- పోలీసులు రంగ ప్రవేశం
- టీడీపీ శ్రేణులు అనుమతి పత్రం చూపడంతో వారికే అవకాశం

పరవాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక విగ్రహ ప్రతిష్ఠ విషయమై మండలంలోని వెన్నెలపాలెంలో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య బుధవారం ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసుల రంగ ప్రవేశంతో వివాదం సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే.. వెన్నెలపాలెం రామాలయంలో వినాయక చవితి రోజున మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఇదే విషయాన్ని రామాలయానికి చెందిన ఆలయ ప్రధానార్చకుడి ద్వారా ఈ నెల 15న మైక్‌లో ప్రచారం చేయించారు. ఇదిలావుంటే, ఈ నెల 25న వైసీపీకి చెందిన గ్రామ సర్పంచ్ వెన్నెల అప్పారావు వినాయక విగ్రహాన్ని కొనుగోలు చేసి రామాలయంలో ఉంచారు. అనంతరం ఆలయానికి తాళం వేసుకొని తనవెంట తీసుకెళ్లిపోయారు. ఈ విషయాన్ని ప్రధాన అర్చకులు టీడీపీ శ్రేణుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈనెల 26న టీడీపీ శ్రేణులు కూడా వినాయక విగ్రహాన్ని కొనుగోలు చేసి రామాలయంలో ఉంచారు. ఆ రోజు సాయంత్రం అర్చకుడు రామాలయంలో పూజా కార్యక్రమం అయిన తరువాత టీడీపీ శ్రేణులు రామాలయానికి కొత్త తాళాలు వేసి వెళ్లిపోయారు. 27న ఉదయం ఏడు గంటలకు సర్పంచ్, వారి అనుచరులు వినాయక విగ్రహ ప్రతిష్ఠ జరిపేందుకు రామాలయం వద్దకు చేరుకున్నారు. అప్పటికే ఆలయానికి తాళం వేసి ఉంది. ప్రధాన అర్చకుడికి ఫోన్ చేసి తాళాలు పట్టుకొని రావాలని సూచించారు. అయితే అర్చకుడు రామాలయానికి చేరుకోలేదు. అప్పటికే ఉదయం పది గంటలు కావస్తుంది. ఆ సమయానికి టీడీపీ శ్రేణులు రామాలయం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. రామాలయంలో తొలిపూజ గ్రామ ప్రథమ పౌరుడుగా తానే చేయాలంటూ సర్పంచ్ పట్టుబట్టారు. అందుకు టీడీపీ శ్రేణులు ఒప్పుకోలేదు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం ప్రారంభమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు సిబ్బందితో హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. అసలు ఏం జరిగిందని రామాలయ అర్చకుడిని అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 25 నుంచి జరిగిన తతంగాన్ని సీఐకు వివరించారు. రామాలయంలో వినాయక విగ్రహ ప్రతిష్ఠకు అనుమతులు తీసుకున్నారా లేదా అని సర్పంచ్‌ను అడిగారు. రామాలయంలో పెట్టడానికి అనుమతులు అవసరం లేదని ఆయన బదులిచ్చారు. పబ్లిక్‌కు సంబంధించి స్థలాలు, భవనాల్లో విగ్రహాలు ప్రతిష్ఠ జరపాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సీఐ స్పష్టం చేశారు. అనుమతులు ఎవరు తీసుకుంటే వారే రామాలయంలో వినాయక విగ్రహ ప్రతిష్ఠ జరపాలని చెప్పడంతో టీడీపీ శ్రేణులు తాము అనుమతులు తీసుకున్నట్టు సంబంధిత పత్రాన్ని చూపించారు. దీంతో టీడీపీ శ్రేణులు విగ్రహ ప్రతిష్ఠ జరుపుకోవచ్చునని సీఐ తెలిపారు. ఈ క్రమంలో వివాదం సద్దుమణిగింది. వైసీపీకి చెందిన పలువురు సీఐ పట్ల అసహనాన్ని వ్యక్తం చేసి వెళ్లిపోయారు.


వైసీపీ శ్రేణులకు నచ్చ చెపుతున్న సీఐ మల్లికార్జునరావు


అరకులోయలో వినాయకుడిని దర్శించుకుంటున్న విజయనగరం జోన్ ఆర్టీసీచైర్మన్ దొన్నుదొర, నాయకులు


పాడేరు అంబేద్కర్ సెంటర్‌లో విగ్రహం


చింతపల్లిలో పూజలు

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం

అరకులోయ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో బుధవారం వినాయకచవితి ఘనంగా జరిగింది. అలాగే, పట్టణంతో పాటు గ్రామాల్లో ఆకృతుల్లో ఉన్న వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు ఇన్‌చార్జి దొన్నుదొర , పెదలబుడు సర్పంచ్ పెట్టెలిదాసుబాబు, టీడీపీ నాయకులు మెయిన్‌రోడ్‌తోపాటు పలుచోట్ల ఏర్పాటుచేసిన మండపాలను సందర్శించి పూజలు చేపట్టారు. అరకులోయ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఎస్‌ఐ గోపాలరావు, సిబ్బంది ఆధ్వర్యంలో వినాయకునికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ హిమగిరి, టీడీపీ నాయకులు పాల్గొని పూజలు చేపట్టారు. అనంతరం అన్నసమారాధన చేపట్టారు. యండపల్లివలస, అరకు గ్రామం వరకు పలు చోట్ల మండపాలు ఏర్పాటు చేశారు. యువత, పిల్లలు, మండపాల కమిటీ సభ్యులు, పలువురు కుటుంబ సభ్యులతో మండపాలను సందర్శించుకుని పూజలు చేపట్టారు.

పాడేరులో..

పాడేరురూరల్: పాడేరులో వినాయక చవితి మహోత్సవాలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆ లయంలో ఆధ్యాత్మిక బృంద సభ్యులు ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలను ఐదు రోజులపాటు నిర్వహించ నున్నామని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు తెలిపారు. అంబేడ్కర్ కూడలి, స్టేట్ బ్యాంకు ఎదురుగా, సినిమాహాలు సెంటర్, గుడివాడవీధి, లోచలిపుట్టు, సుండ్రుపుట్టు, పి.గొందూరు, శీలానగర్ కాలనీ, గడ్డికాలనీ, రేకులకాలనీ తదితర వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. టీడీపీ పాడేరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పట్టణంలోని పలు మండపాల వద్దకు వెళ్లి వినాయక పూజలను చేపట్టారు. మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

నిమజ్జనం

పాడేరులో పలువురు ఉత్సవ కమిటీ ప్రతినిధులు సాయంత్రం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. వంతాడపల్లి గ్రామ సమీపంలోని చిలకలగెడ్డ వరకు అధిక సంఖ్యలో భారీ ఊరేగింపుగా వి గ్రహాలను తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. వందలాది మంది భక్తులు, కమిటీ ప్రతినిధులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కొయ్యూరులో..

కొయ్యూరు: మండలంలో తోటలూరు గ్రామంలో మాదల ప్రసాద్ కుమార్తె సమకూర్చిన భారీ వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. విశ్వహిందూ పరిషత్ మండల కమిటీ గ్రామ, గ్రామానికి వెళ్లి భక్తులను కలసి చవితి విశిష్టతను తెలుపుతూ ప్రచారం సాగించారు. ఈ కార్యక్రమాలలో వీహెచ్‌పీ మండల కార్యదర్శి చడ్డా వెంకటేశ్వర్లు, ఈరే మల్లిబాబు, డివిడి ప్రసాద్ తదిరులు మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలు, సనాతన ధర్మాలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో కొప్పు లక్ష్మి, కాకురు వీర్రాజు, మహిళ ఉపాధ్యక్షురాలు ఈరోజు లలిత, సభ్యులు పాల్గొన్నారు. గ్రామాలలో భజన, కోలాట కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


పాడేరులో స్టేట్ బ్యాంక్ ఎదుట ఏర్పాటు చేసిన మండపం

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు:స్థానిక సాయిబాబా ఆలయం, ఐసీడీఎస్ కార్యాలయం, జీసీసీ డిపో, సంతబయలు తదితర ప్రాంతాలతో పాటు పలు గ్రామాల్లో వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల ప్రతిమలు ఆకట్టుకున్నాయి.

చింతపల్లిలో ..

చింతపల్లి:మండల కేంద్రంలోపాటూ పలు గ్రామాల్లో భక్తులు వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. అలాగే, ఏపీఆర్ కళాశాల, జూనియర్ కళాశాల, వివిధ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వినాయక విగ్రహాలకు నిమజ్జనం చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు భారీ ఊరేగింపు మధ్య వినియకుడిని నిమజ్జనం చేశారు. స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన వినాయక లడ్డూను గ్రంథాలయం అధికారి టి. జగ్గత్‌రాయ్ రూ.3,116కి వేలం ద్వారా దక్కించుకున్నాడు. ఈ వేడుకల్లో ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు, వర్తకసంఘం అధ్యక్షుడు జోగేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు మల్లనాగు, తాటిపాకల హరి, నాగేశ్వరరావు, జగదీశ్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలో వినాయక చవితి ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో అల్లూరి యూత్, కించుమండలో జేమ్స్ యూత్ అధ్వర్యంలలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.


ఉమానీలకంఠేశ్వరస్వామి వినాయక పూజల్లో పాల్గొన్న భక్తులు


వంతాడపల్లి వద్ద విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

హుకుంపేట; గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కొన్ని చోట్ల సాయంత్రం స్వామివారిని నిమజ్జనంచేశారు. గెడ్డలు పొంగి ప్రవహిస్తుండడంతో ఎస్‌ఐ పోలీసు సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశారు.

సీలేరులో..

సీలేరు: స్థానిక మేజర్ పంచాయతీ పరిధి కన్నాబి క్యాంప్, అల్లూరి వీధి, శివాలయంవీధి, దుర్గావీధి, చేపలమార్కెట్, ఎనిమిదోవ క్రాస్ రోడ్డు వద్ద భక్తులు మండపాలను ఏర్పాటు చేశారు. మండపాల్లో అన్నదాన కార్యక్రమాలకు భక్తులు ఏర్పాటు చేస్తున్నారు.


కొయ్యూరు మండలం తోటలూరులో ఏర్పాటు చేసిన విగ్రహం


ముంచంగిపుట్టులో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ


కించుమండలో గణనాథునికి ప్రత్యేక పూజలు


సీలేరు అల్లూరివీధి మండపం వద్ద..

డీఎస్సీలో అటవీ శాఖ ఉద్యోగి అర్హత


స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన ఫారెస్టు బీట్ ఆఫీసర్ రమణ

కొయ్యూరు, ఆగస్టు 28 (ఆంధ్ర జ్యోతి): ఫారెస్టు బీట్ ఆఫీసరుగా పనిచేస్తున్న రమణ ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ లో అర్హత సా ధించారు. రావణాపల్లికి చెందిన సుర్ల రమణ. నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన రమణ చిన్న వయస్సులో తండ్రిని కోల్పోయాడు. తల్లి కూలిపనులు చేస్తూ కొడుకును చదివించి ఉపాధ్యాయుడిగా చూడాలన్నది ఆమె కోరిక. అయితే, చ దువు పూర్తి చేసిన రమణ ప్రభుత్వం వివిధ ఉద్యోగ నియామకాలకు నిర్వహించిన పోటీపరీక్షలకు హా జరవుతూ గత ఏడాది అటవీశాఖలో ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా ఎం పికయ్యారు. అయితే, రమణ తల్లి ఆశయం కోసం ప్రయత్నం కొనసాగించారు. దీంతో ఇ టీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో ఓపెన్ కేటగిరిలో బయాలజీ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి అర్హత సాధించారు.

స్నేహభావంతో మెలగాలి: సీఐ


పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో స్నేహభావంతో మెలగాలని అరకు సీఐ హిమగిరి సిబ్బందికి సూ చించారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం ఆయన రికార్డులను తనిఖీ చేశారు. కేసుల పురోగతిపై ఆరా తీశారు. స్టేషన్‌కు ఆశ్రయించే ప్రజల పట్ల స్నేహభావంగా మెలగాలని సూచించారు. నాటుసారా, గంజాయి రవాణా జరగకుండా పటిష్ఠంగా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన విద్యార్థులకు గంజాయి, బాల్య వివాహాలపై అవగాహన పరచాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ పాపినాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

' గాలికొండ, ఎ. ధారకొండలను జీకే వీధి మండలంలోనే ఉంచాలి'


తహశీల్దార్‌కు వినతి పత్రమిస్తున్న ధారకొండ, గాలికొండ సర్పంచ్‌లు

గూడెంకొత్త వీధి, ఆగస్టు 28 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని గాలికొండ, ఎ.ధారకొండ పంచాయతీలను జీకేవీధి మండల పరిధిలోనే కొనసాగించాలని సర్పంచ్‌లు కె. బుజ్జిబాబు, ఎం.చంటిబాబు కోరారు. గురువారం ఈ సర్పంచ్‌లు గిరిజనులతో కలిసి తహసీల్దార్ అన్నాజీరావుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ రెండు పంచాయతీలను కలుపుకుని ధారకొండ ప్రత్యేక మండలంగా కేటాయించాలని ఆందోళనలు చేపడుతున్నారని, దీనిపై అధికారులు సర్వే చేస్తున్నారన్నారు. గాలికొండ, ఎ.ధారకొండ ప్రజలకు ధారకొండ దూరమవుతుందని, జీకేవీధి దగ్గరగా ఉంటుందన్నారు. ఈ స్థితిలో వీటిని జీకేవీధి మండలంలోనే కొనసాగించాలని వారు కోరారు.

మెగా డీఎస్సీలో ఆదివాసీలకు న్యాయం చేయాలి

» ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజయ్ శర్మ


సదస్సులో మాట్లాడుతున్న అజయ్ శర్మ

పాడేరురూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదివాసీలకు మెగా డీఎస్సీ-2025లో న్యాయం చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజయ్ శర్మ డిమాండ్ చేశారు. స్థానిక మోదకొండమ్మ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన ఆదివాసీ రాష్ట్ర సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆదివాసీ నిరుద్యోగులకు 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ ఇచ్చిన తరువాతే గిరిజన ప్రాంత ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. గిరిజనహక్కులు, చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స , ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగిన ధర్మానపడాల్, జిల్లా కో-కన్వీనర్ భాను సీహెచ్ రావు, నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్.సత్యనారాయణ, మహిళా కన్వీనర్ భవాని, జిల్లా నాయకులు డి.రాజు, విష్ణుమూర్తి, బాలు, కృష్ణంపడాల్‌రాజు, రాజంనాయుడు, 11 మండలాల డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో సదుపాయాల కల్పనకు కార్యాచరణ


మాట్లాడుతున్న మాస్టర్‌ట్రైనర్ శారద కుమారి

చింతపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించినట్టు 'ఆది కర్మయోగి అభియాన్' మాస్టర్ ట్రైనర్ శారద కుమారి అ న్నారు. గురువారం స్థానిక బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వివిధశాఖ అధికారులతో ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అధ్యక్షతన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ మాట్లాడుతూ విలేజ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సమస్యలను వివిధ శాఖల అధికారులు గుర్తించాల్సి ఉందన్నారు. మండలంలో తొలివిడతగా ఆది కర్మయోగి అభియాన్‌కు 31గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ఈ గ్రామాల్లో తాగునీరు, పక్కా గృహాలు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యంపై సమగ్ర నివేదిక రూపొందించాలన్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలు నియంత్రణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో వీబీవీవీ ప్రసాద్, సీడీపీవో శ్రీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గడుతూరి స్వర్ణలత, ఏటీడబ్ల్యూవో నాగజయలక్ష్మి, సీడీపీవో శ్రీదేవి, రామారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సంఘ నూతన కార్యవర్గం


ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాములమ్మ, ఇందుమతి

చింతపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాజెక్టు అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శిలుగా కంకిపాటి రాములమ్మ, ప్రధాన కార్యదర్శి గెమ్మెలి ఇందుమతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ప్రాజెక్టు పరిధి అంగన్‌వాడీ కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈసందర్భంగా యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పెంటమ్మ, సలహాదారులుగా బోనంగి చిన్నయ్య పడాల్‌తోపాటూ 23మందితో కమిటీని ఏర్పాటు చేసుకున్నారు.

కాఫీ తోటల్లో బెర్రీ బోరర్ తెగులు నివారణపై అవగాహన


పకనకూడి కాఫీతోటల్లో రైతులకు అవగాహన కలిగిస్తున్న అధికారులు

అరకులోయ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాఫీతోటల్లో ఇటీవల సోకిన కాఫీ బెర్రీ బోరర్ అనే తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కాఫీ బోర్డు అధికారులు, ఐటీడీఏ నుంచి హార్టీకల్చర్ ఏడీ లకోయి బొంజుబాబు ఆధ్వర్యంలో గురువారం చినలబుడు పంచాయతీ పకనకూడి గ్రామ సమీపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ బొంజిబాబు మాట్లాడుతూ, గతంలో కాఫీతోటల్లో ఇలాంటి గతంలో ఎన్నడూ తెగులు సోకలేదన్నారు. ఈ ఏడాది కాపుకాసే కాయల్లో ఈ తరహ తెగులు(వ్యాధి) సోకినట్టు చెప్పారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గిరిరైతులకు ఈ తెగులు నివారణకు ప్రత్యేకంగా కాఫీ బోర్డు అధికారులు ఎస్ఎల్‌వో ఎస్.రమేశ్, జేఎల్‌వో లక్ష్మీ, ఈఎల్‌లు రమేశ్, సుధీర్ తదితరులు 11 మండలాల ఏఈవోలు ,హెచ్‌సీల ఆధ్వర్యంలో రైతులకు కాఫీతోటల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. తెగులు నియంత్రణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను వివరిస్తున్నామన్నారు. అధికారుల సూచనల ఆధారంగా రైతులు నివారణ చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏడీ బొంజిబాబు రైతులకు స్పష్టం చేశారు. గురువారం ఇక్కడ అవగాహన సదస్సులో పాల్గొన్న వివిధ మండలాల వారు ఆయా మండలాల పరిధిలో కాఫీ రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన కిడారి


విశాఖ విమానాశ్రయంలో మంత్రి లోకేశ్‌తో కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ గురువారం విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీడీపీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు ఎన్నికపై ఇటీవల విశాఖలో జరిగిన సమావేశం, ఇతర అంశాలను మంత్రి లోకేశ్ ప్రస్తావించినట్టు శ్రావణ్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

భీమవరం పీహెచ్‌సీ తనిఖీ


భీమవరం పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్ట్స్ డాక్టర్లు

అనంతగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరం పీహెచ్‌సీని బుధ , గురువారం రెండురోజులపాటుగా నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్‌కు చెందిన డాక్టర్లు రవికాంతీ, శ్రీరామ్ తనిఖీ చేశారు. ముందుగా ఈ బృందానికి డీఎంహెచ్‌వో టి.విశ్వేశరనాయుడు ఘనస్వాగతం పలికారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఓపిడీ, ఐపీడీ, ల్యాబ్, మందుల గదులను, రికార్డులను క్షుణంగా పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అమలవుతున్న ఆరోగ్యసేవల ద్వారా ప్రగతి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్ల పరిధిలోని నాణ్యమైన వైద్యసేవలను అందించాలని ఆదేశించారు. వీరు వైద్య కేంద్రాల్లో అందిస్తున్న సేవలపై నివేదికను కేంద్రప్రభుత్వానికి పంపించి రెండువారాల్లో పర్సంటేజ్ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలోని సర్పంచ్ పి.అప్పారావు, వైద్యాధికారులు అనూప్, జ్ఞానేశ్వరి, నాయుడు, ఎంపీహెచ్‌ఈవో నందయ్య, హెచ్‌వీ. లక్ష్మి, హెచ్‌ఎస్. దాలన్నదొర, ఎల్‌టీ అప్పలనాయుడు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన అవసరం


పాలిటెక్నిక్ విద్యార్థులకు సికిల్ సెల్ పరీక్షలు చేస్తున్న వైద్యురాలు కరుణ

పాడేరురూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సికిల్ సెల్ ఎనీమియాపై యువతకు అవగాహన అవసరమని డాక్టర్.కరుణ అన్నారు. గురువారం ఆమె స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఎక్కువగా ఉన్న సికిల్ సెల్ వ్యాధిపై పరిశోధన చేసినట్టు తెలిపారు. వ్యాధిపై యువతలో అవగాహన పెంచాలన్న లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశానన్నారు. గిరిజన ప్రాంత ప్రజల్లోనే ఈ వ్యాధి ఎక్కువగా వస్తోందన్నారు. ప్రతీ యువత ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ వ్యాధి కలిగిన స్త్రీ, పురుషులు వివాహం చేసుకుంటే 100 శాతం ఈ వ్యాధి కలిగిన పిల్లలు పుట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతీ విద్యార్థి ఈ పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. దీని వల్ల భవిష్యత్తు వ్యాధి లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. వ్యాధి నిర్ధారణ అయినవారు పాడేరు జిల్లా ఆస్పత్రిలో ట్రైబల్ ఎర్లీ ఇంటర్ వెన్షన్ సెల్ వద్ద నమోదు చేసుకుంటే ప్రభుత్వంనుంచి మందులను ఉచితంగా అందిస్తారన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలను చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మరిబాబు, హెల్త్ అసిస్టెంట్ శెట్టి నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీలు సంధ్య, మాయావతి, లలిత, కళావతి, చిన్ని, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా బాబూజీ బాధ్యతలు స్వీకరణ


బాబూజీ, డైరెక్టర్లు బలరాం, గణపతిలను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

ముంచంగిపుట్టు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) మండల కమిటీ చైర్‌పర్సన్‌గా సామల బాబూజీ, డైరెక్టర్లుగా బి.బలరాం, ఆర్.గణపతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతుల అభ్యున్నతి కోసం తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. వీరిని టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి గడ్డంగి రామ్మూర్తి, పార్టీ మండల అధ్యక్షులు కె.సన్యాసమ్మ, ప్రధాన కార్యదర్శి జగత్‌రాయ్, సర్పంచులు పి.పాండురంగస్వామి, వి.లక్ష్మణ్, శివశంకర్, ఎం.చిన్నిబాబు, ఎం.కిశోర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి 'ఆది ఖర్మయోగి'

కొయ్యూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గ్రామాల అభివృద్ధి కోసం ఆది ఖర్మయోగికార్యక్రమం ప్రభుత్వం అమలుచేస్తోందని స్థానిక ఎంపీడీవో వీడీకే ప్రసాద్ అన్నారు. మండలంలో ఆది ఖర్మయోగి పథకానికి ఎంపిక చేసిన 18 పంచాయతీల పరిధి 23 పీవీటీజీ గ్రామాలకు సంబందించిన పంచాతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖలతో గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రెస్పాన్సివ్ గవర్నెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంబాబు, ఆర్‌ఐ అప్పన్న విఆర్‌వోలు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మండపాల వద్ద నిబంధనలు తప్పనిసరి: ఎస్‌ఐ

గూడెంకొత్తవీధి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలు విధిగా పాటించాలని స్థానిక ఎస్‌ఐ కె. సురేశ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంతోపాటూ, పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో మాట్లాడుతూ మండపాల వద్దడీజే సౌండ్స్ ఏర్పాటు చేయరాదన్నారు. అన్నసమారాధణ, నిమజ్జనం నిర్వహించే ముందు రోజు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రికార్డింగ్ డ్యాన్సులు, అశ్లీల నృత్యాలు ప్రదర్శించరాదన్నారు.

ఆర్టీసీ బస్సు, జీపు ఢీ: ఇద్దరికి గాయాలు

జి.మాడుగుల, ఆగస్టు 28 జి.మాడుగుల- చింతపల్లి ప్రధాన రహదారికి కొక్కిరాపల్లి ఘాట్‌లో ఆర్‌టీసీ బస్సు ప్రైవేటు జీపు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గురువారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. జీపులో ప్రయాణిస్తున్నఇద్దరికిగాయాలయ్యాయి. వారిని స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించారు.

పొగమంచు సోయగం


లంబసింగి వ్యూపాయింట్ వద్ద ప్రకృతి సోయగం

ఆంధ్ర కశ్మీర్ లంబసింగి ఘాట్ ప్రకృతి అం దాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. వారం రోజులు గా ఎడతెరిపి లేకుండా వ ర్షాలు గురువారానికి కాస్త తెరిపి ఇవ్వడంతో లంబసింగిలో పొగమంచు సోయగాలు ఆవిష్కృతమయ్యాయి. పచ్చని అడవులను తాకుతూ శ్వేత వర్ణంలో పయనిస్తున్న పొగమంచు సందర్శకులను ఆకట్టుకుంది. దీంతో ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు, పర్యాటకులు ఈ అందాలను ఫోన్‌ల్లో బంధించేందుకు పోటీ పడ్డారు.

- చింతపల్లి/ఆంధ్రజ్యోతి

నూకాలమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



చైర్మన్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న చింతకాయల రాజేశ్

నర్సీపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అబీద్ సెంటర్‌లో గల నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ చైర్మన్‌గా కొరుప్రోలు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా దాడి శ్రీను, కమిటీ సభ్యులతో కార్యనిర్వాహక అధికారి సాంబశివరావు ప్రమాణం చేయించారు.

ఐద్వా జిల్లా మహా సభ కరపత్రాల ఆవిష్కరణ

నర్సీపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కశింకోటలో ఈ నెల 31న నిర్వహించనున్న ఐద్వా జిల్లా మహా సభను అంతా విజయవంతం చేయాలని ఐద్వా ప్రతినిధులు కేవీ సూర్యప్రభ, ఎల్.గౌరీ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఇక్కడ ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సభలో వివిధ సమస్యలపై చర్చించడంతో పాటు కార్యాచరణ ప్రణాళిక చేపడతామన్నారు.

కాల్షియం కార్బైడ్‌తో పండ్లు మగ్గబెడితే చర్యలు



అరటి పండ్ల దుకాణంలో నిబంధనలను వివరిస్తున్న రవికుమార్

నర్సీపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కాల్షియం కార్బైడ్ పిచికారీ చేసి మగ్గబెట్టిన పండ్లు తినడం వలన తీవ్ర ఆనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆహార తనిఖీ విభాగం అధికారి రవి కుమార్ తెలిపారు. ఇక్కడి పెదబొడ్డేపల్లి ఏఎంసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఎటువంటి ఫలాలు తీసుకోవాలో వివరించారు. అనంతరం అబీద్‌సెంటర్‌లో అరటి పండ్ల దుకాణంలో తనిఖీ నిర్వహించి శాంపిల్స్ సేకరించారు. ప్రభుత్వం కాల్షియం కార్బైడ్‌ను పూర్తిగా నిషేధించిందన్నారు. దీనిని మామిడి, అరటి, సపోటా, బొప్పాయి తదితర పండ్లు మగ్గబెట్టడానికి వినియోగించడం నేరమన్నారు. నిబంధనలు అతిక్రమించే వ్యాపారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

బషీర్‌బాగ్ మృతులకు నివాళులు

నర్సీపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమంలో అమరులైన వారికి సీపీఎం, సీపీఐ నాయకులు నివాళులర్పించారు. మృతులు రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి చిత్ర పటాలకు గురువారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు అడిగర్ల రాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, గురుబాబు తదితరులు పాల్గొన్నారు.





గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట చిడతలదిబ్బ వీధిలో.., కొంగసింగి రహదారిలో వివిధ రూపాల్లో కొలువుదీరిన స్వామి



మాకవరపాలెంలోని మండపంలో గణపతికి భక్తుల పూజలు

భక్తిశ్రద్ధలతో గణపతి పూజ

▸▸ ఇంటింటా ఘనంగా వినాయక చవితి వేడుక ▸▸ వీధి వీధినా వివిధ రూపాల్లో కొలువుదీరిన స్వామి ▸▸ పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్న భక్తులు



అబీద్ సెంటర్ అయ్యరక వీధిలో ప్రతిష్ఠించిన 22 అడుగుల మట్టి గణపతి విగ్రహం

నర్సీపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి వేడుకను నియోజకవర్గంలోని నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం మండలాల్లో బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఇంటా ఉండ్రాళ్లతో పాటు వివిధ రకాల పిండి వంటలను సిద్ధం చేసి, స్వామివారి ప్రతిమను ఏర్పాటు చేసి మనసారా ఆరాధించారు. ఈ సందర్భంగా ఎటు చూసినా కోలాహల వాతావరణం నెలకొంది. ఇక వీధివీధినా వివిధ రూపాల్లో ఆది దేవుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. నర్సీపట్నంలోని అబీద్ సెంటర్‌లో గల అయ్యరక వీధిలో 22 అడుగుల భారీ మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు జరుపుతున్నారు. ఐదు రోడ్ల కూడలిలోని వినాయక ఆలయం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. అలాగే, శివపురం, పీనారిపాలెం, కొత్తవీధి, వెంకునాయుడు, బీసీ కాలనీ, రామారావుపేట, శారదానగర్, బలిఘట్టం, పెదబొడ్డేపల్లి తదితర ప్రాంతాల్లో మండపాలను ఏర్పాటు చేసి బొజ్జగణపయ్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. విద్యుద్దీపాలంకరణలో ఏ వీధి చూసినా ధగధగలాడుతోంది. పలుచోట్ల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నారు.

మాకవరపాలెం మండలంలో...

మాకవరపాలెం : మండల వ్యాప్తంగా వినాయక చవితి పండుగను ప్రజలంతా అత్యంత ఘనంగా జరుపుకున్నారు. బుధవారం ఉదయం ఇళ్లలోని స్వామి ప్రతిమలను ఏర్పాటు చేసి ఇంటిల్లిపాదీ వివిధ రకాల పిండి వంటలను ఉంచి భక్తిశ్రద్ధలతో కొలుచుకున్నారు. వీధివీధినా వివిధ రూపాల్లో గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మాకవరపాలెంలో వాయిపుత్ర యూత్ అధ్వర్యంలో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అలాగే రామాలయంతో పాటు కొత్తవీధి వినాయక గుడి వద్ద, సచివాలయం వద్ద వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. అదేవిధంగా తామరం, రాచపల్లి, కొండల అగ్రహారం, లచ్చన్నపాలెం, పైడిపాల తదితర గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ దామోదర్ నాయుడు మాట్లాడుతూ మండలంలో మొత్తం 45 చోట్ల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రజలంతా ఆనందంగా ఈ వేడుకలను జరుపుకోవాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విగ్రహాలను నిమజ్జనం చేసేటప్పుడు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించిన అనంతరం అనుపోత్సవాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు.

గొలుగొండ మండలంలో...

గొలుగొండ/కృష్ణాదేవిపేట : వినాయక చవితి పండుగను బుధవారం మండల వ్యాప్తంగా అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంట్లో స్వామివారి ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. గొలుగొండ, జోగంపేట, కొత్త ఎల్లవరం, చీడిగుమ్మల, పాకలపాడు, రావణాపల్లి, సాలికమల్లవరం గ్రామాల్లోని పలు వీధుల్లో మండలపాలు ఏర్పాటు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అలాగే, ఏఎల్‌పురం, చోద్యం, పాతకృష్ణాదేవిపేట, సీహెచ్. నాగాపురం, కొంగశింగి, లింగంపేట, విప్పలపాలెం తదితర గ్రామాల్లోని పలు వీధుల్లో వివిధ రూపాల్లో ఆదిదేవుని విగ్రహాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా కృష్ణాదేవిపేటలోని చిడతలదిబ్బ వీధిలో అయ్యప్పస్వామి మెట్లపై కుర్చొన్న వినాయకుడు, కొంగసింగి రహదారిలో తపస్సు చేస్తున్నట్లు ఉన్న వినాయకుడు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నిమజ్జనాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కృష్ణాదేవిపేట ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.



నర్సీపట్నం బాలవినాయక ఆలయంలో స్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

నాతవరం మండలంలో...

నాతవరం : మండల వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలను బుధ వారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఇంట్లో స్వామి ప్రతిమను ఏర్పాటు చేసి ఉండ్రాళ్లు, టెంకాయలు, వివిధ రకాల పండ్లతో పాటు పిండి వంటలను నైవేద్యంగా ఉంచి ఇంటిల్లిపాదీ వ్రతాన్ని నిర్వహించారు. ఈ వేడుక సందర్భంగా ప్రతి గ్రామంలోని వీధివీధిలో వివిధ రూపాల్లో గణపతి విగ్రహాను ప్రతిష్ఠించారు. దీంతో ఎక్కడ చూసినా కోలాహల వాతావరణం నెలకొంది.

ఇందిరమ్మ కాలనీలో కుళాయి ద్వారా బురదనీరు

నాతవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ఇందిరమ్మ మోడల్ కాలనీలో గత పది రోజులుగా కుళాయిల ద్వారా నీరు ఎర్రగా వస్తుండడంతో నివాసితులంతా ఆందోళన చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నీటి తాగుతుండడం వల జ్వరాల బారిన పడుతున్నామని చెపుతున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తమకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాల్సిందిగా వారంతా కోరుతున్నారు.



కుళాయి ద్వారా ఎర్రగా వస్తున్న నీరు

మల్లవరం- గిడుతూరు సాగునీటి కాలువకు గండి

▸▸ వృథాగా పోతున్న నీరు ▸▸ ఆందోళనలో రైతులు

మాకవరపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో మల్లవరం-గిడుతూరు సాగునీటి కాలువ సిమెంట్ గట్టుకు గురువారం గండి పడింది. దీంతో నీరు వృథాగా పోతున్నది. వరహా నది నుంచి మల్లవరం-గిడుతూరు కాలువకు నీరు వస్తుంది. దీని కింద సుమారు 500 ఎకరాల ఆయకట్టు వుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రావడంతో సిమెంటు కాలువకు గండి పడింది. అధికారులు వెం టనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చివేత పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కాలువకు గండి పడడంతో వృథాగా పోతున్న నీరు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం


▸▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



ప్రారంభానికి సిద్ధంగా ఉన్నప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మాడుగుల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడమే ప్రభుత్వం లక్ష్యమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి భవనం, డిగ్రీ కళాశాల నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీకి ముఖద్వారం కావడంతో అనేక మందికి ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రి పెద్దదిక్కుగా నిలుస్తుందన్నారు. అయితే, గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఈ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో రూ. 2కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. ఈ భవనం సెప్టెంబర్ ఒకటిన ప్రారంభిస్తామన్నారు. ఇక్కడే పూర్తి స్థాయిలో వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చూస్తానన్నారు. డిగ్రీ కళాశాల నిర్మాణానికి సంబంధించి అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ రూ. కోటి మంజూరు చేశారన్నారు. కలెక్టర్ విజయ్ కృష్ణన్ మరో రూ.10 లక్షల మంజూరు చేస్తానని ప్రకటించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల, అధ్యక్ష, కార్యదర్శులు నందాపు సన్యాసిరావు, పుప్పాల రమేశ్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పుప్పాల లక్ష్మీనారాయణ, బాబు, పెద్దేరు జలాశయం చైర్మన్ అద్దెపల్లి జగ్గారావు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ లెక్కల కాశిబాబు, సూర్యనారాయణరాజు, వైద్యులు, సిబ్బంది, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు



మాడుగులలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మాడుగుల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అదానీ స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వినియోగదారులపై భారం తగదని సీపీఎం మండల కార్యదర్శి ఇరట నర్సింహమూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక బస్టాండ్ ఆవరణంలో నిరసన చేపట్టారు. ముందుగా బషీర్ బాగ్ కాల్పుల్లో మృతి చెందిన అమరవీరులకు నివాళిఅర్పించారు. నాయకులు కార్లి భవాని, సుందర్రాజు, చిన్న, నాగరాజు, జిలాని, పోతురాజు పాల్గొన్నారు.

విద్యుత్ అమర వీరులకు నివాళి

దేవరాపల్లి: విద్యుత్ అమర వీరుల పోరాటం చిరస్మరణీయం అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి.వెంకన్న అన్నారు. మండలంలోని వాలాబులో గురువారం బషీరాబాగ్ కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చోడవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెం, జన్నవరం సబ్‌స్టేషన్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు నర్సీపట్నం ఈపీడీసీఎల్ డీఈ అప్పారావు తెలిపారు. వెంకన్నపాలెం, ముద్దుర్తి, కొత్తపల్లి, నరసాపురం, గంధవరం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అలాగే జన్నవరం, బెన్నవోలు, చాకిపల్లి, రామపజోగిపాలెం, కన్నంపాలెం, తిమ్మనపాలెం శుక్రవారం ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు.



వడ్డాది పెదబజారు వీధిలో పర్వతం అధిరోహిస్తున్న గణనాథుడు



కె.కోటపాడులో వినాయక విగ్రహాన్ని దర్శించుకున్న భక్తులు

ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల విన్నూత్న రీతిలో గణనాథులను పోటా పోటీగా ఏర్పాటుచేశారు. ఈ నవరాత్రి ఉత్సవాల్లో గ్రామాలలో భజనలు, ఇతర సాంస్కృతి కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. సీతయ్యపేట, పెదమదిన గున్నెంపూడి, రాజాం, బుచ్చెయ్యపేట, వడ్డాది, విజయరామరాజుపేట, గ్రామాలలో భారీ గణనాథ విగ్రహాలను నెలకొల్పారు. విజయరామరాజుపేటలో 21 మండపాల్లో విగ్రహాలకు పూజలు చేస్తున్నారు.

చోడవరంలో భారీ వినాయక విగ్రహం



చోడవరంలో 63 అడుగుల ఆదిగణపతి విగ్రహం

చోడవరం: వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా స్థానిక హార్డింజి అతిథిగృహం ఆవరణలో ఏర్పాటు చేసిన 63 అడుగుల ఆదిగణపతి భారీ విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. సద్భావన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాజేశ్ కొప్పాక సారథ్యం లో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పూజలు చేసి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి, ఆదిగణపతిని దర్శించుకుని పూజలు చేశారు.



ముకుందపురంలో వేసిన ఆదియోగి సెట్

రోలుగుంట: మండలంలోని నిండుగొండతో పాటు పలు గ్రామాల్లో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పూజలు చేశారు.

రావికమతం: మండలంలో కొత్తకోట శివాలయం వీధిలో సిద్ధి వినాయక యూత్ యువకులు భారీ విగ్రహం ఏర్పాటు చేశారు. అలాగే చినపాచిలలో రెండు చోట్ల ఏర్పాటు చేసిన వినాయకుల విగ్రహాలు ఆకట్టుకున్నాయి.

మాడుగుల: మండల కేంద్రంలో పలు వీధుల్లో యువకులు భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక దేవి ఆడిటోరియం నుంచి వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకు వెళ్లి మండపాల్లో ప్రతిష్ఠించి పూజలు చేశారు. మాడుగుల రావిచెట్టు జంక్షన్ వద్దనున్న ప్రభుత్వ (గెడ్డబడి) ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో వినాయక ప్రతిమలకు ఉపాధ్యాయులు సూర్యనారాయణ, శ్రీనిసరావు, ప్రభాకర్‌రావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



దేవరాపల్లిలో విగ్రహం

మాడుగుల రూరల్: మండలంలో వినాయక చవితిని ఘనంగా జరుపుకున్నారు. పలు వీధుల్లో వినాయకుని కొలువుంచేందుకు తాటాకు పందిళ్లు, పలు సెటింగ్‌లు వేశారు. భారీ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు. పలు చోట్ల అన్నసమారాధనలు చేశారు.

ముకుందపురంలో అలరిస్తున్న సెట్..

ముకుందపురంలో స్థానిక యూత్ సభ్యులు 22 అడుగుల ఆదియోగి సెట్ వేసి అందులో వినాయకున్ని కొలువుంచారు. కోయంబత్తూర్‌లో నున్న తరహాలో ఈ ఆదియోగి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

కె.కోటపాడు: గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. భక్తులు పూజలు నిర్వహించారు.

దేవరాపల్లి: మండల కేంద్రంలో యాతపేట, మొండివీధి, నాయుడు వీధి, రామాలయం, మహేశ్వరి థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



చినపాచిలలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వర్షంతో అవస్థలు

మాడుగుల రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం మధ్యాహ్నం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి పొడి వాతావరణం ఉంది. మధ్యాహ్నం 2 తర్వాత తేలికపాటి జల్లుల వర్షం పడింది. వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వరిమడులు, లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరింది.

మాడుగుల: మాడుగులలో బుధవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. దీంతో పంటపొలాల్లోకి నీరు చేరింది. కొన్నిచోట్ల వరి నాట్లు కొట్టుకుపోయాయి. పాలగెడ్డ రిజర్వాయర్‌లోనికి వరద నీరు చేరడంతో మాడుగుల నుంచి ఖండివరం వెళ్లే రోడ్డు గంగాలమ్మ ఆలయం వద్ద గల కాలువపై రాకపోకలు సాగించే ప్రజలు, రైతులు ఇబ్బంది పడ్డారు.

కొట్టుకుపోయిన కాజ్‌వే...

చీడికాడ: మండలంలో జి.కొత్తపల్లి నుంచి పొలాలకు వెళ్లే రోడ్డు కాజ్‌వే మంగళవారం కొట్టుకుపోయింది. దీనిని గ్రామ సర్పంచ్ కొల్లి సూరి నాయుడు రైతులతో కలిసి పరిశీలించారు. జి. కొత్తపల్లి నుంచి తురువోలు పొలాలకు వెళ్లే ఈ రహదారిలో మిరాసగెడ్డ వద్ద నిర్మించిన ఈ కాజ్‌వే కొట్టుకుపోవడంతో రైతులు ఇబ్బందులుపడాల్సి వస్తోంది. గురువారం పంచాయతీరాజ్ అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఏఈ అజయ్, పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపి, తదితరులు పాల్గొన్నారు.



జి. కొత్తపల్లి వద్ద కొట్టుకుపోయిన కాజ్‌వే


కళాకారులకు సంపూర్ణ సహకారం



గాయకుడు శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంత కళాకారుల ప్రగతికి సంపూర్ణ సహకారం అందిస్తామని స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు తెలిపారు. వినాయక ఉత్సవాల సందర్భంగా విఘ్నేశ్వరుని ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు కోవెల శ్రీనివాసరావు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను అలరించాయి. సంగీత కళాకారులు రామయ్యరెడ్డి, తాడి సుజాతలు ఉత్సవాలలో కీర్తనలు పా డారు. ఈ సందర్భంగా గాయకుడు శ్రీనివాసరావును ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబమూర్తి, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

'ఉచిత బస్సు ప్రయాణంతో అయోమయం'



ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

దేవరాపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తమ బతుకులు అయోమయ పరిస్థితికి చేరాయని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం నిరసన తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జీవనోపాధికి తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న వాహన మిత్ర రూ. 10 వేలు పిటినెస్ తదితరరూపాల్లో తిరిగి చెల్లించాల్సి వస్తోందన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు.

తుప్పలు తొలగించాలని వినతి

రోలుగుంట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక హైస్కూల్ ప్రాంతంలో సీసీ రోడ్డు పిచ్చి మొక్కలు పెరిగిపోయి. దీంతో ఇదే ప్రాంతంలో కొండమీద ఉన్న బావి వద నుంచి తాగునీటిని తెచ్చుకునేందుకు మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ స్థితిలో గ్రామ ఐటీడీపీ ఇన్‌చార్జి బనికెల సురేశ్ ఎంపీడీఓ కార్యాలయం ఏఓ లక్ష్మికి వినతిపత్రం అందించారు. పిచ్చి మొక్కలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పేపర్ ఏజెంట్ మృతి

మాడుగుల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చాలా ఏళ్లుగా ఆంధ్రజ్యోతి పేపర్ ఏజెంట్‌గా పనిచేస్తున్న గండి పెంటయ్య బుధవారం మృతి చెందారు. పెంటయ్య ఆంధ్రజ్యోతితోపాటు ప్రముఖ దినపత్రికల ఏజెంటుగా పనిచేశారు. అలాగే, గ్రామ పంచాయతీ వాటర్ సప్లైర్‌గా పనిచేసిన ఆయన పదవీ విరమణ పొందారు. ఆయన కుటుంబానికి పలువురు సానుభూతిని తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన జిల్లా నాయకులు


మంత్రి లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బత్తుల తాతయ్యబాబు


మంత్రి లోకేశ్‌తో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను జిల్లాకు చెందిన పలువురు టీడీపీ నాయకులు గురువారం విమానాశ్రయంలో కలిసి స్వాగతం పలికారు. మంత్రి లోకేశ్‌ను కలిసిన వారిలో హోం మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, గవర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఉన్నారు.

ఒడ్డిమెట్ట ఆలయానికి భక్తుల తాకిడి



ఒడ్డిమెట్ట ఆలయంలో విశేష అలంకరణలో వినాయకుడు, కొండపైకి వెళ్లే మెట్లమార్గంలో భక్తుల సందడి

నక్కపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడ్డిమెట్ట గ్రామంలో కొలువైన లక్ష్మీ గణపతి ఆలయానికి వినాయక చవితి పండుగ సందర్భంగా బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొండపై స్వయంవ్యక్తమైన స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా, కాకినాడ జిల్లాల నుంచి అనేక మంది భక్తులు ఒడ్డిమెట్ట తరలివచ్చారు.

ఎంజే పురంలో వింత ఆచారం

▸ మూడు నెలలపాటు వినాయక ఉత్సవాలు

అచ్యుతాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా వినాయక విగ్రహాలను 3, 5, 9, 11 రోజులు ఉంచి నిత్యపూజలు జరిపి నిమజ్జనం చేస్తారు. కానీ అచ్యుతాపురం మండలం ఎంజేపురంలో మూడు నెలలపాటు వినాయక విగ్రహాన్ని ఉంచి తరువాత నిమజ్జనం చేస్తారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ పద్ధతి పాటిస్తున్నారు. ఈ గ్రామంలో విగ్రహాన్ని అన్ని వీధుల్లో ఊరేగిస్తారు. వాహనం పైనుంచి విగ్రహాన్ని దింపడానికి గ్రామస్థులు పోటీ పడతారు. విగ్రహాన్ని మోస్తే కోరిన కోర్కెలు ఏడాదిలో తీరిపోతాయని గ్రామస్థుల ప్రగాఢ విశ్వాసం. కార్తీక మాసంలో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తారు.


వినాయకుని విగ్రహాన్ని మోయడానికి పోటీ పడుతున్న భక్తులు

వాణిజ్య సముదాయాలపై జీవీఎంసీ నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

వున్నాయి. న్యూకాలనీ వద్ద మూడు, రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వద్ద 10, గవరపాలెం చిన్నయ్య స్కూల్ వద్ద ఆరు దుకాణాలు శిథిలావస్థకు చేరడంతో వీటిని అద్దెకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. అద్దెకు ఇచ్చిన మిగిలిన షాపుల్లో గత మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పాత బకాయిలు కలుపుకొని రూ.2.6 కోట్లు అద్దె బకాయిలు వున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.56 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. ఎన్టీఆర్ స్టేడియం వద్ద ప్రధాన రహదారిన ఆనుకొని వున్న దుకాణాలకు డిమాండ్ ఎక్కువ. కానీ అద్దెకు తీసుకున్న వ్యాపారులు సక్రమంగా అద్దె చెల్లించడం లేదని తెలిసింది. కానీ జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడంలేదు.

విశాఖ చేరుకున్న మంత్రి లోకేశ్

... 5వ పేజీ తరువాయి

చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో ఆయనకు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఆయన..వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించారు. పార్టీ కార్యాలయ ఆవరణలో నిలిపివుంచిన బస్సులో బస చేసిన లోకేశ్‌ను ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావు, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, విశాఖ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ తదితర నాయకులు కలిశారు.

నేడు కార్యక్రమాలకు హాజరుకానున్న లోకేశ్

మంత్రి లోకేశ్ శుక్రవారం ఉదయం 11 గంటలకు పీఎం పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్‌లో అర్థ సమృద్ధి ఐసీఏఐ నేషనల్ కాన్ఫరెన్స్‌కు హాజరవుతారు. అక్కడ నుంచి 11.30 గంటలకు చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి ఏఐ ల్యాబ్స్‌ను ప్రారంభించి, విద్యార్థులతో మాట్లాడతారు. మధ్యాహ్నం 12.15 గంటలకు రుషికొండలోని రాడిసిన్ బ్లూ హోటల్‌కు చేరుకుని ఏఐ ల్యాబ్స్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు నోవాటెల్ హోటల్‌కు వెళ్లి ఏరోస్పేస్ మ్యాన్యుఫ్యాక్చరింగ్‌పై సీఐఐ నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సుకు హాజరవుతారు. సాయంత్రం నాలుగు నుంచి 5.30 గంటల వరకు ఏయూ కన్వెన్షన్ హాలులో జరిగే జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం ఆరు నుంచి 7.30 గంటల వరకు రాడిసిన్ బ్లూ హోటల్‌లో భారత మహిళా క్రికెట్ జట్టుతో మర్యాదపూర్వకంగా భేటీ కానున్నారు. అనంతరం పార్టీ కార్యాలయానికి చేరుకుని రాత్రికి బస చేస్తారు.

జనసేనకు యువతే ప్రాణం

... 5వ పేజీ తరువాయి

కొన్ని ఇబ్బందులు వస్తాయని, వాటిని సమయానుకూలంగా అధిగమించాలని సూచించారు. ఈ రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే అలయన్స్ అవసరమని, ప్రజలు కూడా అదే కోరుకుంటున్నారు కాబట్టి అంతా కలిసిముందుకు సాగాల్సి ఉందన్నారు. అలయన్స్‌లో ఉన్నా పార్టీని ఎలా బలోపేతం చేయాలనే దానిపై అంతా దృష్టి పెట్టి పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ సమావేశంతో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, లోకం మాధవి, బొలిశెట్టి శ్రీనివాస్, పార్లమెంటు సభ్యులు బాలశౌరి, ఎమ్మెల్సీ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థినులకు అవగాహన అవసరం

▸ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ


విద్యార్థినులతో మాట్లాడుతున్న డాక్టర్ రాయపాటి శైలజ

పరవాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై విద్యార్థినులకు తప్పనిసరిగా అవగాహన అవసరమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. గురువారం ఆమె మహిళా శిశు సంక్షేమ, పోలీస్‌శాఖల అధికారులతో కలిసి పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఇటీవల కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు గుత్తల శ్రీధర్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్ తొలుత బాధిత విద్యార్థినితో మాట్లాడారు. ఆ రోజు జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కళాశాల, బయట ప్రదేశాల్లో వేధింపులు చోటుచేసుకుంటే ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా పోలీస్, ఉమెన్ హెల్ప్ లైన్ 181, 100, 101, 1098, 1930 నంబర్లకు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమా, మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి, పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, ఐసీడీఎస్ సబ్బవరం ప్రాజెక్టు సీడీపీవో లలితకుమారి, ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్‌బాబు, సీఐ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఎస్.రాయవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధర్మవరం అగ్రహారం, ఎస్.రాయవరం మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాల మేరకు ధర్మవరం అగ్రహారం నుంచి ముగ్గురు ప్రయాణికులతో ఓ ఆటో ఎస్.రాయవరం వెళుతుండగా, ఎదురుగా వస్తున్న మరో ఆటో బలంగా ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న లింగరాజుపాలేనికి చెందిన పెద్దేటి కొండలరావు, పెనుగొల్లుకు చెందిన సీహెచ్ సుశీల, రాంబిల్లి మండలం గోకివాడ గ్రామానికి చెందిన సేనాపతి రాజులమ్మ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నక్కపల్లి ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ చెప్పారు.

క్రీడా ప్రోత్సాహాల బకాయిలు విడుదల

▸ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రోత్సాహాలకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన రూ.4.9 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు గురువారం తెలిపారు. దీని వల్ల 43 మంది అంతర్జాతీయ క్రీడాకారులకు పోత్సాహం లభించిందని అన్నారు. క్రీడల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చూపుతున్న చిత్తశుద్ధి ప్రశంసనీయమని అన్నారు. గత ప్రభుత్వం క్రీడాకారుల బకాయిలు విడుదల చేయకపోగా ఆడుదాం ఆంధ్రా అంటూ నిధులు దుర్వినియోగం చేసిందని ఆరోపించారు.

అధికారుల్లో పెచ్చరిల్లిన అవినీతి

... 5వ పేజీ తరువాయి

నిఘా వ్యవస్థ కూడా తన పరిధిలోనే వుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. ఎవరెవరు, ఏయే అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారో తనకు తెలుసని, ఇకనుంచైనా తీరు మార్చుకోవాలని, లేకపోతే మిమ్మల్నే మార్చాల్సి వస్తుందని హెచ్చరించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడే అధికారులు, ఉద్యోగులు ఇదే చివరి హెచ్చరికగా భావించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. లంచాలు ఇవ్వనిదే ఇళ్లు, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విద్యుత్ వినియోగదారులు ఫోన్ చేస్తే స్పందించడం ఇష్టం లేని అధికారులు సెలవుపై వెళ్లిపోవాలని స్పష్టం చేశారు. రెవెన్యూ శాఖలో కూడా అక్రమాలు జరుగుతున్నాయని, కొందరు వీఆర్వోలు, అధికారులు ఎడాపెడా లంచాలు తీసుకుంటున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. ఇటువంటి అక్రమాలను నిరోధించాల్సిన తహశీల్దార్లు ఏం చేస్తున్నారని మంత్రి అనిత ప్రశ్నించారు. సర్వేయర్లు ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తున్నారని, కొందరైతే తహశీల్దార్ల ఆదేశాలను సైతం లెక్కచేయడం లేదని అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్‌శాఖల్లో కూడా కొందరు అధికారులు తలబిరుసుగా వ్యవహరిస్తున్నారని, ప్రతి పనిలో కమీషన్లు ఆశిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇకపై ఇటువంటి వారిని ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటానని మంత్రి అనిత హెచ్చరించారు.

బాక్సింగ్ క్రీడాకారిణులకు బంగారు పతకాలు


యర్రా తేజస్విని


బొంతు మౌనిక

నర్సీపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో ఇటీవల తిరుపతిలో జరిగిన 'అమరావతి బాక్సింగ్ చాంపియన్‌షిప్' పోటీల్లో నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళా బాక్సర్లు బంగారు పతకాలు సాధించారు. అండర్ 22 పోటీల్లో 81 కిలోల విభాగంలో యర్రా తేజస్విని, 75 కిలోల విభాగంలో బొంతు మౌనిక ఉత్తమ ప్రతిభ కనబరిచి పసిడి పతకాలను సొంతం చేసుకున్నారని శాప్ కోచ్ అబ్బు తెలిపారు. ఈ నెల 29వ తేదీ స్పోర్ట్స్ డే సందర్భంగా విశాఖపట్నంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, శాప్ చైర్మన్ చేతుల మీదుగా పతకాలు అందుకుంటారని ఆయన పేర్కొన్నారు.

భావి ఉపాధ్యాయుల ఆనంద హేల

... 5వ పేజీ తరువాయి

రెవెన్యూ అధికారుల బృందం విమల విద్యాలయంలో అందుబాటులో ఉంది. ధ్రువపత్రాలపై గెజిటెడ్ అధికారి సంతకం అవసరమనుకుంటే అక్కడ విధులు నిర్వహించి హైస్కూల్ హెచ్‌ఎంలు సంతకం చేశారు.

ఉదయం పది గంటల నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో ఒకేసారి పరిశీలన ప్రారంభం కావడంతో సర్వర్‌పై కొంత ఒత్తిడి పెరిగింది. దీంతో ఒక్కొక్క అభ్యర్థి ధ్రువపత్రాల పరిశీలనకు 15 నుంచి 20 నిమిషాల సమయం పట్టింది. మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతున్నప్పుడు పరీక్షలకు దరఖాస్తు చేసిన సమయంలో సమర్పించిన ధ్రువపత్రాలతో సరిపోల్చిన తరువాత వెరిఫికేషన్ అధికారి సెల్‌కు ఓటీపీ వస్తుంది. అక్కడితే పరిశీలన ప్రక్రియ పూర్తయినట్టుగా ప్రకటిస్తున్నారు. కొందరు మహిళా అభ్యర్థులు భర్త కులధ్రువీకరణ పత్రం తీసుకురాగా తిరస్కరించారు. తండ్రి కుల ధ్రువీకరణ పత్రం ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉన్నందున సర్టిఫికెట్ తీసుకురావడానికి సమయం ఇస్తున్నారు. కాగా ధ్రువపత్రాల పరిశీలనకు జిల్లా పరిశీలకుడిగా నియమితులైన కేజీబీవీ విద్యాలయాల సెక్రటరీ దేవానందరెడ్డి మొత్తం ప్రక్రియను పర్యవేక్షించారు. అవసరమైన సూచనలు చేశారు. పాఠశాల విద్యా శాఖ విశాఖ ప్రాంతీయ సంచాలకుడు విజయభాస్కర్ నేతృత్వంలో విశాఖ డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ ధ్రువపత్రాల పరిశీలన చూస్తున్నారు. జిల్లాలో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఇతర సిబ్బంది ధ్రువపత్రాల పరిశీలన విధులు నిర్వహించారు. అయితే సర్వర్ నెమ్మదిగా పనిచేయడంతో ధ్రువపత్రాల పరిశీలన గురువారం రాత్రి వరకూ కొనసాగింది.

శ్రమించారు, సాధించారు

... 5వ పేజీ తరువాయి

ఇద్దరు కుమార్తెలు. ఉపాధ్యాయునిగా పనిచేయాలని సత్యనారాయణ ఆశపడినా కోర్కె నెరవేరలేదు. అయితే తాను చేయాలనుకున్న టీచర్ ఉద్యోగంలో తన ఇద్దరు కుమార్తెలను చూడాలనుకున్న సత్యనారాయణ అదే ఆశయంతో చదివించారు. పెద్దకుమార్తె ఉపాధ్యాయురాలిగా ఎంపికై ప్రస్తుతం పాడేరు సమీపాన ఒక స్కూలులో పనిచేస్తున్నారు. రెండో కుమార్తె సుజాత ఇటీవల నిర్వహించిన డీఎస్సీ (ఎస్జీటీ)లో ఏకంగా జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి తండ్రి లక్ష్యాన్ని నెరవేర్చారు.

అవమానించిన చోట విజయగర్వంతో మరొకరు..

మాడుగుల మండలం జమ్మాదేవిపేటకు చెందిన తాటికొండ ధనలక్ష్మిది పేద కుటుంబం. భర్తకు అర ఎకరా పొలం మాత్రమే ఉంది. వారికి ఇద్దరు పిల్లలు. చదువు పట్ల ధనలక్ష్మిలో ఆసక్తిని గమనించిన భర్త అనేక కష్టాలకు ఓర్చి చదివించారు. ఇద్దరు పిల్లలు కలిగిన తరువాత చదువు ఎందుకు? అంటూ గ్రామంలో అనేకమంది హేళన చేశారు. అన్నింటినీ భరిస్తూ డీఎస్సీకి ప్రిపేరైన ధనలక్ష్మి ఎస్జీటీ కేటగిరీలో జిల్లాలో ఏకంగా రెండో ర్యాంకు సాధించారు. అవమానాలు ఎదుర్కొన్న చోటే..భర్తను తల ఎత్తుకునేలా చేశారు.

మా జీవితాల్లో వెలుగులు నింపింది


తాటికొండ ధనలక్ష్మి, ఎస్జీటీ రెండో ర్యాంకర్

ఎస్జీటీ కేటగిరీలో రెండో ర్యాంకు సాధించడం ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం మా కుటుంబంలో వెలుగులు నింపింది. నాకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. చదువంటే చాలా ఇష్టం. నా ఇష్టాన్ని గుర్తించి నా భర్త చదివించారు. మా గ్రామంలో కొంతమంది నా భర్తను, నన్ను హేళన చేశారు. అయినా వెనకడుగువేయకుండా కష్టపడి చదివాను. విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగించేలా బోధన చేస్తాను.

కాజ్‌వేలను ముంచెత్తిన వరద

... 5వ పేజీ తరువాయి

మళ్లించారు. ఇక వడ్డాది- విజయరామరాజుపేట మధ్య తాచేరు గెడ్డపై పురాతన వంతెన రెండేళ్ల క్రితం కూలిపోయిన విషయం తెలిసిందే. ఇక్కడ తాత్కాలికంగా కాజ్‌వే నిర్మించారు. తాచేరు గెడ్డలో వరద ఉధృతికి కాజ్‌వే కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. సుమారు పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు కాజ్‌వే పూర్తిగా ధ్వంసమైంది. అధికారులు ఇంతవరకు పునరుద్ధరణ పనులు చేపట్టలేదు. చోడవరం నుంచి వడ్డాది, మాడుగుల, పాడేరు ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ద్విచక్ర వాహనాలతోపాటు ఇతర అన్ని రకాల వాహనాలు సుమారు పది కిలోమీటర్లు చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తున్నది. దీంతో ప్రయాణ సమయం పెరగడమే కాకుండా.. ప్రత్యామ్నాయ మార్గం చిన్నది కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా వుంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి, తాచేరు గెడ్డపై కాజ్‌వే పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని ఈ మార్గంలో ప్రయాణించే పలు మండలాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

గరిష్ఠ స్థాయిలో పెద్దేరు నీటిమట్టం

మాడుగుల రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పెద్దేరు జలాశయంలోకి వరద నీరు చేరుతున్నది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లుకాగా బుధవారం సాయంత్రం 645 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో నీటిమట్టం 136.5 మీటర్లకు చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు రాత్రి తొమ్మిది గంటలకు ఒక గేటు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేశారు. గురువారం ఉదయం ఐదు గంటలకు గేటు మూసేశారు. 333 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో నీటిమట్టం 136 మీటర్లు వుంది. ఇన్‌ఫ్లోను బట్టి స్పిల్‌వే గేటును ఎత్తి అదనపు నీటిని నదిలోకి విడిచిపెడతామని ఏఈ సుధాకరరెడ్డి తెలిపారు.

కోనాంలోకి 610 క్యూసెక్కుల వరద

చీడికాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లుకాగా గురువారం 610 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుంది. నీటిమట్టం 99.55 మీటర్లకు చేరుకుంది. నీటిమట్టం 100 మీటర్లు దాటితే స్పిల్‌వే గేట్లను ఎత్తి నీటి దిగువకు విడుదల చేస్తామని ఏఈఈ సత్యనారాయణదొర తెలిపారు.

బహిరంగ ప్రకటన

ICICI Bank

నమోదిత కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్, చక్లీ సర్కిల్ సమీపాన, ఓల్డ్ పద్రా రోడ్, వడోదర - 390007
కార్పొరేట్ కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి - 400051

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ (ICICI బ్యాంక్) నుండి పొందిన (సౌకర్యం) తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు నోటీసు జారీచేయడమైనది. వారు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను సెప్టెంబర్ 08, 2025న ఇ-వేలం వేయడానికి మాకు తప్పనిసరి అయ్యింది. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ఖాతాను తొలగించడానికి/ ఇ-వేలం తేదీని మార్పు చేయడానికి ICICI బ్యాంక్‌కు అధికారం ఉంది. వేలం -https://gold.samil.in ఆన్‌లైన్‌లో మ.12:30 గం. నుండి మ.3:30 గం. మధ్య నిర్వహించబడుతుంది. సవివరమైన నియమ నిబంధనల కోసం ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవండి. మరణించిన రుణగ్రహీత విషయంలో, వారి న్యాయవారసులకు అన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు	రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు	రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు : ఆదోని		శాఖ పేరు : పిఠాపురం		శాఖ పేరు : అమరికంది	
068762018334	మజిద్‌పుర నిస్సార్ అహ్మద్	067862016640	దుర్గప్రసాద్ నీల	286162000280	బొంగు అశోక్
శాఖ పేరు : హిందూపూర్		శాఖ పేరు : పోరంకి		శాఖ పేరు : తిరుపతి- బై పాస్ రోడ్	
067257000013	కెకె రవీంద్ర బాబు	236862002207	ప్రభాకరరావు సన్నపాటి	253757000076	ఉమ్మడి వెంకటరమణ
శాఖ పేరు : కుదిగిరి		శాఖ పేరు : ప్రొద్దుటూరు		శాఖ పేరు : కూకట్‌పల్లి-నిజాంపేట్	
069857000101	తమ్మినేని భాస్కర్ రెడ్డి	067562012806	మదలపల్లె కృష్ణవేణి	180557000085	ఉప్పల విజయ్ కుమార్
శాఖ పేరు : మదనపల్లె		శాఖ పేరు : తెనాలి		శాఖ పేరు : పెద్దపల్లి	
067357000238	ముళ్ళగొరి రెడ్డి ప్రసాద్	253162005776	మల్లికార్జున పెమ్మసాని	068362020727	పుట్ట రాధ

తేది:29.08.2025
ప్రదేశం : కృష్ణా, అన్నమయ్య, గుంటూరు, కాకినాడ, కర్నూలు, పార్వతీపురం మన్యం, ప్రకాశం, శ్రీ సత్య సాయి, తిరుపతి, వైఎస్ఆర్, కరీంనగర్, నెల్లూరు

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున



క్రైం... crime news

ఏలేరు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం బట్లపూడి పంచాయతీ రాయుడుపేట వద్ద ఏలేరు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ గురువారం తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక ఇన్‌చార్జి వీఆర్వో శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే ఈ మృతదేహానికి సంబంధించి ఎటువంటి వివరాలు లభ్యం కాలేదన్నారు. మృతుడి ఒంటిపై ఎటువంటి దుస్తులు లేవని, సుమారు 50 ఏళ్ల వయస్సు ఉంటుందని అంచనా వేశారు. 5.6 అడుగుల పొడవు కలిగి చామనఛాయ రంగుతో ఉన్నాడన్నారు. తెల్లని జుట్టు కలిగి ఉన్నట్టు చెప్పారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, దీనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

చవితి ఉత్సవాల్లో విషాదం

▸ విద్యుదాఘాతంతో యువకుడి మృతి


విజయ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శెట్టిబలిజ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద విషాదం చోటు చేసుకుంది. మండలంలోని కాగిత గ్రామానికి చెందిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్ జిగటాల విజయ్‌కుమార్ (25) బుధవారం సాయంత్రం గణేశ్ మండపం వద్ద విద్యుత్ దీపాలు అమర్చుతుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. దీంతో కింద పడిపోయిన ఆయనను ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతిచెందాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కుమారస్వామి చెప్పారు.

31 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

ముంచంగిపుట్టు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుజభంగి జంక్షన్ సమీపంలో 31 కిలోల గంజాయితో ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ జె.రామకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించి గురువారం ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా నుంచి ముంచంగిపుట్టు మండలం మీదుగా గంజాయి రవాణా అవుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బుధవారం కుజభంగి జంక్షన్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అటుగా వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా 31 కిలోల గంజాయి బయటపడింది. కారులో వున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరు శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పనస గణేశ్, అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం నందివలస గ్రామానికి చెందిన తాంగుల బుద్దు, డుంబ్రిగుడ మండలం సరియా గ్రామానికి చెందిన కొర్ర నందకుమార్‌గా గుర్తించారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా బిమరామ్ గ్రామానికి చెందిన కిముడు డబా పరారయ్యాడు. గంజాయిని ఒడిశాలో కొనుగోలు చేసి విశాఖపట్నం తీసుకెళుతున్నట్టు నిందితులు చెప్పారని, కేసు నమోదు చేసిన అనంతరం నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ చెప్పారు.

మహిళ మెడలో రెండు తులాల పుస్తెల తాడు అపహరణ

కొత్తూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోని రెండు తులాల పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి తెంచుకుపోయిన ఘటన బుధవారం జరిగింది. దీనికి సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అనకాపల్లి మండలం చేనుల అగ్రహారం గ్రామానికి చెందిన మడక రమా గ్రామానికి దగ్గరలో ఉన్న ఒక కాలేజీలో రోజువారీ కార్మికురాలిగా చేస్తోంది. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో విధులకు హాజరయ్యేందు వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడుకు తెంపుకొని కొండుపాలెం వైపు వెళ్లిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని తండ్రి, కొడుకు మృతి

... 5వ పేజీ తరువాయి

నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో రైలు ఢీకొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. బుధవారం రైల్వే వంతెన వద్ద గుణశేఖర్ మృతదేహం కనిపించింది. తన భర్త కనిపించడంలేదని జనని ఇచ్చిన ఫిర్యాదుపై పాయకరావుపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. రైల్వే వంతెన కింద గాలింపు చర్యలు చేపట్టగా, కొంతదూరంలో అనిల్ మృతదేహం లభించింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తుని ప్రభుత్వ రైల్వే పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	108.00
లైవ్ ధర	128.00
విత్ స్కిన్	226.00
స్కిన్ లెస్	236.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554



CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, SERAPATHI SANTHOSHAMMA (Old Name) W/o. Polamarasetti Uma Mahesh, R/o. 27-11-35/2, Sundarayya Colony, Srinagar, Gajuwaka, VSP. Changed my name from SERAPATHI SANTHOSHAMMA (Old Name) to POLAMARASETTI SANTHOSHI (New Name) henceforth I am being called as POLAMARASETTI SANTHOSHI (New Name) for all purposes.
AJV_241927

CHANGE OF NAME

★ I, THIRUMALASETTY SWAPNA (Old Name) W/o. Challa Naveen, R/o. D.No.26-20-2/3, HPCL Lane, Chaitanya Nagar, Chinna Gantyada, Gajuwaka, VSP. Change my name from THIRUMALASETTY SWAPNA (Old Name) to CHALLA SWAPNA PRIYA (New Name) henceforth I am being called as CHALLA SWAPNA PRIYA (New Name) for all purposes.
AJV_241928

CHANGE OF NAME

★ I, KADALI PRIYANVADA (Old Name) W/o. Kadali Chandrayya, R/o. 10-123, Venkata Ramana Nagar, Ganganapalle, East Godavari. Change my name from KADALI PRIYANVADA (Old name) to KADALI PRIYAMVADA (New Name) henceforth I am being called as KADALI PRIYAMVADA (New Name) for all purposes.
AJV_241929

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact : 9963231176, 9966165093